


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in








EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:100 SUNDAY ,SEPTEMBER 20,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :100 ఆదివారం , సెప్టెంబర్ 20, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి



**ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శ**

**భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఏఏఐకి భూమి అప్పగింత**

**మూడు ప్యాకేజీలుగా పనులు, డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు ప్రణాళిక**

తెలంగాణ పత్రిక:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి మిగతా2లో








## విద్యుత్‌పై ఎల్‌నినో ప్రభావం
## సౌర విద్యుత్‌పై దృష్టి పెట్టిన ప్రజలు

**ఎల్‌నినో విద్యుత్ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇప్పటికే విద్యుత్‌కు ఉన్న అపారమైన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుంటే, విద్యుత్ ఉత్పత్తిని వైవిధ్యపరచడంలో విఫలమైతే తీవ్రమైన ఇబ్బందులు తలెత్తవచ్చు**

తెలంగాణ పత్రిక హైదరాబాద్ : ప్రస్తుతం అందరినీ కలవరపాటుకు గురిచేస్తున్న అంశం ఎల్‌నినో. శాస్త్రవేత్తలు హెచ్చరించినట్లుగానే వర్షాకాలంపై ఇది తీవ్ర ప్రభావమే చూపించింది. తగినంత వర్షాలు లేక ఓవైపు పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అదే సమయంలో ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తూ దంచికొడుతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. దీనికి తగ్గట్టుగానే మిగతా2లో

## జన్వాడ భూములు పరిశీలించిన కాంగ్రెస్ బృందం



- అక్రమాలు జరిగాయని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు.
- జన్వాడ ఫాంహౌస్ ను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీలు
- ఈ ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవన్న ఎంపీ చామల
- అసలు యజమాని ఎవరనే దానిపై అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్య

తెలంగాణ పత్రిక ప్రతినిధి: జన్వాడ ఫామ్‌హౌస్ భూములను కాంగ్రెస్ బృందం పరిశీలించింది. కేటీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. జన్వాడ భూములపై చామల కిరణ్ కుమార్ రెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని జన్వాడ ఫామ్‌హౌస్ భూములను 2లో

## యువత ప్రాణాలు తీస్తున్న సోషల్ మీడియా

**సరికొత్త నేరాలకు దారి తీస్తున్న రీల్స్ మోజు**

తెలంగాణ పత్రిక స్పెషల్ స్టోరీ: ఒక్క వీడియో వైరలైతే చాలు స్టార్ అయిపోవచ్చు అని యువత ఆలోచిస్తు న్నారు. సోషల్ మీడియాలో ఫాలోవర్ల కోసం రీల్స్ చేస్తూ పిల్లలు సరికొత్త నేరాలు చేస్తున్నారు. ప్రస్తుతం యువత చదువు పక్కన పెట్టేసి సోషల్? మీడియాలో రీల్స్? చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. వాళ్లు చేసే కంటెంట్ ఎలా ఉన్నా సరే ఒక్క వీడియో వైరలైతే చాలు రాత్రికి రాత్రే స్టార్ అయిపోవచ్చు అనే ఆలోచనలో ఉన్నారు. ఫాలోవర్లు పెరిగితే ప్రమోషన్లతో పాటు డబ్బు సంపాదించొచ్చు. అంతే కాదు అందరిలో కన్నా మనమే స్పెషల్‌గా ఉండొచ్చని భావిస్తున్నారు.



ఏదేమైనా సోషల్ మీడియాలో ఫాలోవర్ల కోసం రీల్స్, సెల్ఫీల మోజు సరికొత్త నేరాలు, దుష్పరిణామాలకు దారి తీస్తోంది. ప్రమాదకర స్టంట్లు చేస్తూ కొందరు తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగిలుస్తుంటే, మరికొన్ని సందర్భాల్లో కుటుంబాలు మిగతా2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారిని
## పలు విద్యాసంస్థలపై విజిలెన్స్ తనిఖీలు..

తెలంగాణ పత్రిక హైదరాబాద్: రాజధాని నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్? అడ్మిషన్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణ నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారులు మిగతా2లో

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్



**హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్**

**తన అనర్హతను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేయడమే కారణం**

**ఇప్పటికే సుప్రీంలో కేవియట్ దాఖలు చేసిన ఇతర ఎమ్మెల్యేలు**

తెలంగాణ పత్రిక :ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన మిగతా2లో

## ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్

**180 ఎకరాలు మావేనంటున్న రైతులు!**



**ఎర్రవల్లి 325 సర్వే నంబర్‌పై కొనసాగుతున్న పరిశీలన**

**మొత్తం 388 ఎకరాల భూములపై అధికారుల సర్వే**

**180 ఎకరాలు తమవేనంటున్న వెంకటాపూర్ రైతులు**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలోని ప్రభుత్వ భూముల సర్వేలో కీలక పరిణామం చోటుచేసుకుంది.

-తెలంగాణ పత్రిక మిగతా2లో

## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు

**గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు**

**రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం**

**నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ**



2

## వినాయకా గంగమ్మ ఒడి చేరేదెట్లా?
## చెరువుల్లో నీరు లేక నిమజ్జనానికి అవస్థలు.!



తెలంగాణ పత్రిక ప్రతినిధి: హైదరాబాద్ నగరంలోని పలు చెరువుల్లో నీరు లేక నిమజ్జనం చేయలేని దుస్థితి ఏర్పడింది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భాగ్యనగరంలోని పలు చెరువుల వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మిగతా2లో

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక


# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి: ప్రజలను కోరిన సీఎం రేవంత్

ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

**మూడు ప్యాకేజీల్లో పనులు**

విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# విద్యుత్‌పై ఎల్‌నినో ప్రభావం సౌర విద్యుత్‌పై దృష్టి పెట్టిన ప్రజలు..

అదే సమయంలో ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తూ దంచికొడుతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. దీనికి తగ్గట్టుగానే విద్యుత్ డిమాండ్ కూడా ఊహించని స్థాయిలో పెరుగుతోంది. పలు చోట్ల కరెంటు కోతలు కూడా విధిస్తున్నారు. మరి, ఎల్‌నినో ప్రభావం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగింది? భవిష్యత్‌లో ఇంకా ఎంత పెరిగే అవకాశం ఉంది ? ఆ ప్రభావం ఏయే రంగాలపై ఉండనుంది? ప్రభుత్వాల దగ్గరున్న ప్రణాళికలు ఏంటి? రానురాను విద్యుత్‌పై ఎల్‌నినో మరింత ప్రభావం : ఊహించినట్లుగానే ఎల్‌నినో ప్రభావం రోజురోజుకి తీవ్రరూపం దాల్చుతోంది. దేశంలోని అనేక చోట్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తగినన్ని వానలు కురవక వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. మరో వైపు ఇది అసలు వర్షాకాలమేనా అనిపిస్తూ ఎండలు మండిపోతున్నాయి. మరి, వీటివల్ల ఎఫెక్ట్ అవుతున్న రంగాల్లో విద్యుత్ రంగంలో కూడా ఉంది. వాస్తవ పరిస్థితులు చూస్తే ఆ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. సరిగ్గా గమనిస్తే ఎల్‌నినో ప్రభావం ప్రారంభమైనప్పటి నుంచి దేశంలో విద్యుత్ వినియోగం పెరుగుతూ వస్తోంది. ఈ సారి వేసవి కాలంలో ఎన్నడూ లేనంతగా పవర్ డిమాండ్ ఏర్పడింది. క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తే ముందు ఎలాంటి ఇబ్బందులు ఉంటాయనేది ఊహించడానికే కష్టంగా ఉంది. "ఎల్ నినో ప్రభావం మరో ఏడాది పాటు కొనసాగి, విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రధాన నగరాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడం గమనార్హం.దీని వల్ల ముందు ముందు అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది"-దొంతి నరసింహారెడ్డి, పర్యవరణవేత్త . వాస్తవంగా చెప్పాలంటే అనేక అవసరాల దృష్ట్యా కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ వినియోగం పెరుగుతూ వస్తోంది. దానికి తోడు పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా జనవరి నుంచి వేసవి కాలం పూర్తయ్యే వరకు ఏటా విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతూనే ఉంది. ఉదాహరణగా జనవరి నెల తీసుకుంటే కేంద్ర విద్యుత్ సంస్థ-సీఈఏ గణాంకాల ప్రకారం గడిచిన ఐదేళ్లలో 2026 జనవరి నెలలో విద్యుత్ డిమాండ్ అత్యధికంగా 245 గిగావాట్లకు పైగా నమోదైంది. ఇది 2025 జనవరితో పోలిస్తే 5.1 శాతం ఎక్కువ. అదే సమయంలో 2023 జనవరితో పోల్చితే 12.6 శాతం ఎక్కువ. ఇలా ఏటికేడు విద్యుత్ డిమాండ్ పెరుగుతూనే వస్తోంది. ఈ ఐదేళ్లలో ఒక్క జనవరి నెలలోనే పవర్ డిమాండ్ 28 శాతం మేర పెరిగిందని విద్యుత్ నివేదికలు చెబుతున్నాయి. మరి, జనవరిలోనే ఈ స్థాయిలో విద్యుత్‌కి డిమాండ్ ఏర్పడితే ఎండల తీవ్రత అధికంగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో సహజంగానే విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వైవిధ్యం పాటించకపోతే ఇబ్బందులు తప్పవు : విద్యుత్ డిమాండ్ లెక్కలను పరిశీలిస్తే ముందుగా చెప్పినట్లు ఈ ఏడాది ప్రారంభంలో అంటే జనవరి నెలలో గరిష్ఠంగా 245 గిగావాట్లు నమోదైంది. అదే ఏప్రిల్ నెలలో 256 గిగావాట్లకు పెరిగింది. మే నెలలో 270 గిగావాట్లకు చేరుకుంది. ఈ ఏడాదిలో ఇదే అత్యధికం. అంటే ఎల్‌నినో ప్రభావం తీవ్రం అవుతున్న కొద్దీ విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతూనే ఉంది. జూన్, జులై నెలలో కొద్దిపాటి వర్షాల కారణంగా కాస్త తగ్గినా ఆగస్టు, సెప్టెంబర్ నెలలో మళ్లీ భారీగా పెరిగింది. వానాకాలంలోనూ వేసవిని తలపించేలా ఎండలు మండిపోతుండటమే కారణం. ప్రాంతాన్ని బట్టి 30 నుంచి 35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగమూ అదే స్థాయిలో నమోదు అవుతోంది. సెప్టెంబర్ 10న దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ 269 గిగావాట్లకు చేరుకుంది. అంటే మే నెలలో ఉన్న డిమాండ్ ప్రకారం అదే స్థాయిలో వర్షాకాలమైన సెప్టెంబర్ నెలలో పవర్ డిమాండ్ పెరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఏ రంగాల్లో విద్యుత్ వినియోగం అధికంగా ఉందని చూస్తే అత్యధికంగా పారిశ్రామిక, ఉత్పత్తి రంగాలు అధిక వాటా కలిగి ఉన్నాయి. దాదాపు 40 నుంచి 45 శాతం వరకు పారిశ్రామిక రంగమే విద్యుత్‌ను వినియోగిస్తోంది. ఎందుకంటే విద్యుత్ లేకుంటే పరిశ్రమల మనుగడే లేదు. వాటి అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తి, సరఫరా జరగడం ఎంతో కీలకం. ముఖ్యంగా స్టీల్, సిమెంట్, ఆటోమొబైల్ ఉత్పత్తితో పాటు ఇటీవలి కాలంలో ఊపందుకుంటున్న సెమీకండక్టర్ తయారీ రంగాల్లో నిరంతరం ఉత్పత్తి ప్రక్రియ కొనసాగడంలో విద్యుత్ కీలకంగా ఉంటుంది. అలాగే, ఐటీ సెక్టార్‌లో పవర్ డిమాండ్ విపరీతంగా ఉంది. సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు డేటా సెంటర్లలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

# యువత ప్రాణాలు తీస్తున్న సోషల్ మీడియా

**రీల్స్‌కి బానిసవుతున్న యువత**

మద్యం, గ్యాంబ్లింగ్?కు బానిసగా మారిన వారు ఎలా దాన్ని వదులుకోరో సోషల్? మీడియాకు అడిక్ట్? అయితే కూడా అంతే వ్యసనంగా ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడూ ఏదో ఒక రూపంలో అందరితో ప్రత్యేక గుర్తింపు ఉండాలనే భావన ఎంతకైనా దారితీస్తోందంటున్నారు. ఇది ఎలా ఉంటుందంటే ఏదైనా రీల్? పెట్టిన వెంటనే లైకులు రాకపోతే ఒత్తిడికి లోనవుతారు. బైకు స్టంట్లు చేయడం, ఎత్తయిన ప్రాంతాల నుంచి దూకుతున్నట్లు వీడియోలు చేయడం, అసభ్య పదజాలం ఉపయోగించడం, అవసరం లేకున్నా అర్ధనగ్న ప్రదర్శలు చేయడం ఇలాంటి కోవలోకి వస్తాయి.

**ఇటీవల జరిగిన ఘటనలు**

హైదరాబాద్?లో రీల్స్? మోజులో పడి. తనను, కుమార్తెను పట్టించుకోవడం లేదని చివరకు వంట కూడా చేయడం లేదని ఆగ్రహానికి గురైన ఓ వ్యక్తి భార్యను హతమార్చాడు. తల్లి మరణించడం. తండ్రి జులైపాలవ్వంతో రెండేళ్ల పాప అనాథగా మారింది. జహీరాబాద్?కు చెందిన ఇద్దరు యువకులు శ్రీశైలం వెళ్లి వస్తూ డిండి జలాశయం వద్ద సెల్ఫీ తీసుకునేందుకు ఆగారు. సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తు జలాశయంలో మునిగి మరణించారు. ఇటీవల ఝార్ఖండ్?లోని గార్వా జిల్లాలో 19 ఏళ్ల యువతి రైల్వే ట్రాక్? సమీపంలో రీల్స్? చేస్తుండగా రైలు ఢీకొట్టింది. ఘటనలో యువతి రెండు చేతులు కోల్పోగా ప్రాణాపాయ స్థితికి చేరింది. "డిజిటల్? అక్షరాస్యత లేకపోవడంతో కూడా సోషల్? మీడియాలకు బానిసలవుతున్నారు. ఎలాగైనా సరే అందరిలో గుర్తింపు తెచ్చుకోవాలనుకోవడం మరో సమస్య. దీనికి అడ్డుకట్ట వేయాలంటే సోషల్ మీడియాను అవసరం వరకే ఉపయోగించాలి. పిల్లలకు ఫోన్? ఇచ్చినప్పుడు వారు ఏం చేస్తున్నారో చూడాలి. పరిమితులు నిర్దేశించాలి" - డి. రాజు, సీఐ, నాంపల్లి

**15-30 ఏళ్లలోపువారే అధికం**

ఈ రీల్స్? మోజులో పడుతున్న వారిలో 15-30 ఏళ్లలోపువారే ఎక్కువగా ఉన్నారని పోలీసులు తెలిపారు. బైకు రేసింగ్? స్టంట్లు, రైలు వెనక నుంచి వస్తున్నప్పుడు నిల్చోవడం, ఉరేసుకున్నట్లు నటించడం, నీటి కాలువలు, జలాశయాల్లో, జంతువులతో, పర్వాతాలపై సెల్ఫీ తీసుకోవడం వంటివి చేస్తూ ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో ప్రతి సంవత్సరం సుమారు 500-700 మంది వరకు రైలు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అందులో 10 శాతం మంది రైలు తలుపుల వద్ద నిలబడి సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ జారిపడడం, స్తంభాలకు తగిలి మరణిస్తున్నారు. ది వరల్డ్ ఆఫ్ స్టాటిస్టిక్స్ 2024 నివేదిక ప్రకారం దేశంలో సెల్ఫీల కారణంగా 214 మంది ప్రాణాలు కోల్పోగా 57 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.

**తల్లిదండ్రులు గమనించాల్సిన విషయాలు**

పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి కంటెంట్ చూస్తున్నారో కచ్చితంగా గమనించాలి. పిల్లలకు మొబైల్ ఇచ్చాక దాన్ని ఎలా ఉపయోగిస్తున్నారో పర్యవేక్షించాలి. సోషల్ మీడియా అకౌంట్ ప్రొఫైళ్లను తనిఖీ చేస్తుండాలి. 15- 25 ఏళ్ల యువత ఎక్కువగా అభ్యంతరకరంగా వీడియోలు, ఫొటోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. వీరిపై ఎక్కువ దృష్టి సారించాలి. కేసులు నమోదైతే భవిష్యత్‌లో ఇబ్బందులు ఉంటాయని హెచ్చరించాలి. పిల్లలు ఫోన్ చూడటం తప్పు కాదు - ఇలా వాడుకోలేకపోతే మాత్రం నిజంగా తప్పే!

# వినాయకా గంగమ్మ ఒడి చేరేదెట్టా? చెరువుల్లో నీరు లేక నిమజ్జనానికి అవస్థలు.!

భాగ్యనగరంలోని పలు చెరువుల వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కాసారా ల్లో నీరు లేకపోవడమనేది ప్రధాన సమస్యగా మారింది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో సమస్య మరింత క్లిష్టతరంగా మారింది. దీంతో నిమజ్జనాలకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.వంద కోట్ల వ్యయంతో క్రేన్లు, తాత్కాలిక కోనేరులకు టెండర్లు పిలిచినప్పటికీ ఆ స్థాయిలో మాత్రం సౌకర్యాలు కనిపించడం లేదంటూ భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**నిమజ్జన ఏర్పాట్లపై భక్తుల అసహనం**

నిజాంపేట్లోని శ్రీరాముని కుంట వర్షాలు లేక ఎండిపోయింది. దీంతో అ చెరువు పక్కన తొట్టిని ఏర్పాటు చేసి ట్యాంకర్తో నీటిని పంపారు. అయితే అందులో 3 అడుగుల వినాయక విగ్రహాలకు మాత్రమే నిమజ్జనాలు చేయడానికి వీలవుతుంది. గతంలో భారీ విగ్రహాలు కూడా ఈ చెరువులో నిమజ్జనం చేసేవారని, అధికారులు కుంటను ఎండగట్టడంతో విగ్రహాలను బాచుపల్లి, అంబీర్ చెరువు వరకు తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాపయ్యకుంట చెరువు వద్ద ఏర్పాట్లపైనా భక్తులు మండిపడుతున్నారు.

**ట్యాంక్బండ్పై అనుమతి లేదు**

అత్తాపూర్లో పెద్దతాళ్ల కుంట చెరువు వద్ద కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. అక్కడ నిమజ్జనాలకు అనువైన స్థలం కనిపించడం లేదు. ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో చెరువులోకి దిగే మార్గం కరవైంది. దీంతో భక్తులు 10 కిలోమీటర్ల దూరం వెళ్లి రాజేంద్రనగర్ చెరువులో నిమజ్జనాలు చేస్తున్నారు. కూకట్పల్లి ఐడీఎల్ చెరువు అభివృద్ధి పనులు చేసే క్రమంలో నీటిని దిగువకు విడిచిపెట్టారు. దీంతో ఆ కాసారం ఎండిపోయింది. చేసేదేమీలేక నిమజ్జనాల కోసం చెరువులో రెండు గుంతలు తవ్వి, వాటిని ట్యాంకర్లతో నింపారు. హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న సంజీవయ్య పార్కు, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, ట్యాంక్‌బండ్ కేంద్రాలు వినాయక నిమజ్జనాలకు ప్రధానమైనవి. ఈ 4 ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లకు అధికారులు సిద్ధం కాగా, అంతలోనే ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలను నిలిపేస్తూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), పోలీస్ కమిషనర్ల పేరుతో అక్కడ పోస్టర్లు వెలిశాయి. చివరి రోజున కూడా అనుమతించే ప్రసక్తే లేదని అధికారులు తేల్చి చెబుతుండడంతో గణేశ్ ఉత్సవ కమిటీ, భక్తులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.తాత్కాలిక ఏర్పాట్లు లేకపోవడంతోనే ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాలు సరిగా లేకపోవడంతో పాటు అభివృద్ధి పనుల కారణంగా చాలా చెరువుల్లో నీరు అడుగంటింది. అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. తాత్కాలిక కోనేరులకు టెండర్లు పిలిచినప్పటికీ అవి ఎక్కడా కానరావట్లేదు. నిమజ్జనం వేళ జాగ్రత్త నిమజ్జనాల వేళ రద్దీ ఎక్కువ ఉంటే వృద్ధులు, మహిళలు, చిన్నారులు శోభాయాత్రకు దూరంగా ఉండటం ఉత్తమం. నిమజ్జన కేంద్రాల వద్ద చిన్నారులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దు. నీటిలో విగ్రహాన్ని నిమజ్జనం చేసే ప్రక్రియ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ద్వారానే జరగాలి. భక్తులు నేరుగా పాల్గొంటే నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉంటుందన్న విషయం గమనించాలి. ముఖ్యంగా ఈత రాని వ్యక్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. చీకటి పడక ముందే నిమజ్జనం ప్రక్రియ పూర్తి చేసుకోవడం ముఖ్యం. చీకట్లో చెరువుల వద్దకు వెళ్లకపోవడం ఉత్తమం. అత్యవసరమైతే స్థానిక పోలీసులను సంప్రదించాలి.

**ఘనంగా సాగనంపి - క్షేమంగా ఇళ్లకు చేరండి : నిమజ్జనాల వేళ ఈ జాగ్రత్తలు మరవకండి**

హైదరాబాద్ గణేశ్ నిమజ్జన సేవలో పాల్గొనాలనుందా? - ఇలా రిజిస్ట్రేషన్ చేసుకోండి

## జన్వాడ భూములు పరిశీలించిన కాంగ్రెస్ బృందం

జన్వాడ ఫామ్‌హౌస్ భూములను కాంగ్రెస్ బృందం పరిశీలించింది. కేటీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. జన్వాడ భూములపై చామల కిరణ్ కుమార్ రెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని జన్వాడ ఫామ్‌హౌస్ భూములను కాంగ్రెస్ బృందం పరిశీలించింది. సీనియర్ నేత కోదండ రెడ్డి నేతృత్వంలోని బృందం ఈ భూముల పరిశీలన కోసం వెళ్లింది. అయితే కేటీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని పక్కకు తప్పించడంతో కాంగ్రెస్ బృందం భూములు పరిశీలించింది. జన్వాడ వద్ద బుల్కాపూర్ నాలా ఆక్రమణలకు గురైందని, ఈ నాలా వాటర్ హుస్సేన్ సాగర్?లో కలవాల్సి ఉందని, సామాజిక కార్యకర్త డాక్టర్ లుబ్నా శర్వత్ తెలిపారు. బుల్కాపూర్ నాలాపై ఆక్రమణలు జరిగి ఫామ్ హౌస్ నిర్మాణాలు చేపట్టారని వాటిని తొలగించాలని పోరాడుతున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మల్లు రవి, ఆది శ్రీనివాస్ పలువురు భూములను పరిశీలించారు. అక్రమాల గురించి ప్రజలుకు తెలియజేయాలనే ఇక్కడికి వచ్చాం. ఫామ్‌హౌస్‌ను నాలాపై కట్టారు. ఫామ్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు లేవు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదు. ఫామ్‌హౌస్ భూ లెక్కలు తేలుస్తాం మల్లు రవి, ఎంపీ జన్వాడ ఫామ్‌హౌస్ భవన నిర్మాణానికి అనుమతి లేదు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పలు విద్యాసంస్థలపై విజిలెన్స్ తనిఖీలు..

రాజధాని నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్? అడ్మిషన్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణ నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలతో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణలున్నాయి. దీంతో బయోమెట్రిక్, సిబ్బంది వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి.

**కళాశాల రికార్డులు, స్కాలర్‌షిప్‌లపై ఆరా**

ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పలు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్?ఫోర్స్?మెంట్? అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో ఈ రోజు ఉదయం నుంచి అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ఈ తనిఖీల్లో విద్యార్థుల వాస్తవ సంఖ్య, కళాశాల రికార్డులు, ప్రవేశాల వివరాలు, స్కాలర్?షిప్?లకు సంబంధించిన డేటా తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్?పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు: హరీశ్‌రావు

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. "నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు.

# బాలల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం








-పిల్లల హక్కులు, పోక్సో చట్టంపై ప్రతి ఉపాధ్యాయుడికి అవగాహన అవసరం

-పిల్లల్లో ప్రవర్తనా మార్పులను గుర్తించి, సమస్యలను ముందుగానే పరిష్కరించాలి

-మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

-మిషన్ బాల సురక్ష--శిక్షా, న్యాయ 2026లో భాగంగా ఉపాధ్యాయులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం

-ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల

పెద్దపల్లి,ప్రతినిధి సెప్టెంబర్ 19 ( తెలంగాణ పత్రిక )

పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, రక్షణతో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మిషన్ బాల సురక్ష--శిక్షా, న్యాయ 2026లో భాగంగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ చేసిన ఉపాధ్యాయులకు పిల్లల హక్కులపై వన్ డే సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల, అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (పోక్సో) కె. స్వప్న రాణి, డీసీపీ రాంరెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, రక్షణతో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయం పాఠశాలల్లో ఉపాధ్యాయులతో గడుపుతారని, కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులతో పంచుకోలేని సమస్యలను కూడా ఉపాధ్యాయులతో పంచుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులకు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అఘాయిత్యాలను అరికట్టడంతో పాటు పిల్లలను రక్షించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. పిల్లలపై నేరాలకు పాల్పడే వారిలో ఎక్కువ మంది వారికి తెలిసినవారే ఉండే అవకాశం ఉన్నందున, పిల్లల భద్రత విషయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి**

పిల్లలకు చదువుతో పాటు మంచి నడవడిక, రక్షణ, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించడం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ముఖ్య బాధ్యత అని జిల్లా జడ్జి తెలిపారు. బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం గురించి, బాలురు, బాలికలకు లభించే చట్టపరమైన రక్షణలు, న్యాయపరమైన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు అకస్మాత్తుగా మౌనంగా ఉండటం, చురుగ్గా లేకపోవడం వంటి ప్రవర్తనా మార్పులను ఉపాధ్యాయులు గుర్తించాలని తెలిపారు. పిల్లల సమస్యలను ముందుగానే గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడం ద్వారా వారిని రక్షించవచ్చన్నారు. పాఠశాలల్లో పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, విద్యార్థుల స్నేహితుల వలయాన్ని కూడా గమనించాలని సూచించారు. పిల్లలతో శరీర మార్పులు, లైంగిక అంశాలు, మంచి స్పర్శ--చెడు స్పర్శ వంటి అంశాలపై తల్లిదండ్రులు ఇంటి నుంచే చర్చించి, వారికి అవసరమైన భద్రతా సూత్రాలను నేర్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక స్థితిని కూడా గమనించాలని, కార్యక్రమంలో పొందిన అవగాహనను తమ పాఠశాలల్లోని తోటి ఉపాధ్యాయులకు కూడా విస్తరించాలని సూచించారు.

**మాదకద్రవ్యాల నివారణపై అప్రమత్తంగా ఉండాలి డీసీపీ రాంరెడ్డి**

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని డీసీపీ రాంరెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో 6, 7, 8వ తరగతుల విద్యార్థుల్లో కూడా కొన్ని రకాల వ్యసనాల ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సంకేతాలు, అనుమానాలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు 112 నంబర్‌కు సమాచారం అందించి అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని శ్రద్ధగా తీసుకుని, పాఠశాలలకు వెళ్లిన అనంతరం తోటి ఉపాధ్యాయులకు కూడా బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని డీసీపీ కోరారు.

**జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్" పోస్టర్ ఆవిష్కరణ**

అనంతరం సాధన సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచల ఆవిష్కరించారు. బాలల హక్కులు, వారి రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా విద్యాశాఖ అధికారి (ఇన్‌చార్జి) వి. హన్మంతు, గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కవిత, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జితేందర్, లీగల్ కం ప్రొవిషన్ ఆఫీసర్ రజిత, న్యాయ, పోలీస్, విద్యాశాఖ అధికారులు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ చేసిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి






-నీటి సమర్థ వినియోగంతో అధిక దిగుబడులు సాధించాలి

-సాంప్రదాయ సాగు పద్ధతుల నుంచి ఆధునిక విధానాల వైపు రైతులు మారాలి

-విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవాలి

-ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

-వరి వరహాలు' కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిది సెప్టెంబర్ 19 ( తెలంగాణ పత్రిక )

వరి సాగులో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించేలా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం పెద్దపల్లి రంగంపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరి వరహాలు' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో వరి సాగులో నీటిని సమర్థవంతంగా వినియోగించిన రైతులకు ఎకరాకు రూ. 500 చొప్పున ప్రోత్సాహక చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఎంతో ముఖ్యమని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. అదే పాత పంటలు, పాత సాగు విధానాలను కొనసాగించడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించలేమని, ఆధునిక సాంకేతికతను వినియోగించి తక్కువ వనరులతో అధిక దిగుబడులు సాధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధిక పరిమాణంలో ఉత్పత్తితో పాటు అత్యుత్తమ నాణ్యతను సాధించి ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడే స్థాయికి మన వ్యవసాయ ఉత్పత్తులు చేరుకోవాలని అన్నారు. ఇందుకోసం శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కరీంనగర్ ప్రాంతంలో సుమారు 60 వేల ఎకరాల్లో రైతులను సాంప్రదాయ వరి సాగు విధానాల నుంచి ఆధునిక సాంకేతిక పద్ధతుల వైపు మళ్లించడంలో సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన కలెక్టర్ పేర్కొన్నారు. రైతులను ఎన్నో సంవత్సరాలుగా అనుసరిస్తున్న పాత సాగు పద్ధతుల నుంచి కొత్త విధానాలకు మళ్లించడం అంత సులభమైన విషయం కాదని, ఈ స్థాయిలో మార్పు తీసుకురావడం గొప్ప విజయమని తెలిపారు. వరి సాగులో నీటిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు పంటకు అవసరమైన సమయంలో తగిన మోతాదులో నీటిని అందించి మెరుగైన దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి రైతు నీటి సమర్థ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శాస్త్రీయ సాగు విధానాలను పాటించడం ద్వారా పంట దిగుబడులను పెంచడంతో పాటు చీడపీడల సమస్యలను కూడా నియంత్రించవచ్చని తెలిపారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి విజయవంతమైన రైతులు తమ అనుభవాలను చుట్టుపక్కల రైతులతో పంచుకోవాలని కోరారు. ఒక రైతు సాధించిన విజయం మరెందరో రైతులకు స్ఫూర్తిగా నిలవాలని, విజయవంతమైన సాగు విధానాలను విస్తృతంగా ప్రచారం చేసి ఇతర రైతులు కూడా వాటిని అనుసరించేలా చూడాలని సూచించారు. రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులపై మరింత అవగాహన కల్పిస్తూ, నీటి పొదుపు, శాస్త్రీయ సాగు, అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తుల సాధన దిశగా వ్యవసాయ శాఖ, సంబంధిత సంస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.






## మృతుని కుటుంబానికి చేయూత అందించిన మోగిలాల రామచంద్రం గౌడ్

-50 కేజీల బియ్యం అందజేత



గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన పాపన్న గారి దేవయ్య గౌడ్ ఇటీవల మరణించగా శనివారం రోజున వారి కుటుంబ సభ్యులను ఈసీ మెంబర్ మొగులాల రామచంద్రం గౌడ్ పరామర్శించి ఓదార్చి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు అనంతరం కార్యకర్తలతో కలిసి 50 కేజీల బియ్యాన్ని వారి కుటుంబానికి అందజేశారు కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన తెలిపారు ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జోగు సురేష్ మండల కార్యదర్శి టేకుమల్ల ప్రవీణ్, యువ నాయకులు దేశెట్టి రాజశేఖర్, అల్లెపు రమేష్, వెంకటస్వామి, దుబాసి నరసింహులు, సాయి, జోగుచందు, దేవదాస్, శీను మహేష్ లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట మండలంలో రీ-సర్వే గ్రామ సభలు



ఇల్లంతకుంట, సెప్టెంబర్ 19 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్ పేట, జంగంరెడ్డిపల్లె, తిప్పాపూర్ గ్రామాల్లో శనివారం రీ-సర్వే గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్. సురేష్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డీఐ వెంకటచారి, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు. రీ-సర్వే ఆవశ్యకత, చేపట్టే విధానంపై రైతులకు వివరించారు.

## ఇల్లంతకుంటలో వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):

మండల కేంద్రంలో పలు వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ గుడి ఆవరణలోని వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా, బస్టాండ్ ఆవరణలో రాజస్థాన్ రాజ్ పురోహిత్ బాబు సింగ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 19 తెలంగాణ పత్రిక

మండల కేంద్రంలో పలు వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ గుడి ఆవరణలోని వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా, బస్టాండ్ ఆవరణలో రాజస్థాన్ రాజ్ పురోహిత్ బాబు సింగ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగులకు క్రీడా సాంస్కృతిక పోటీలు



గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19

2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులకు మండల స్థాయి క్రీడా సాంస్కృతిక పోటీలు మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో భవిత కేంద్రం నందు ఉపాధ్యాయులు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు వారు మాట్లాడుతూ వైకల్యం శరీరానికే గాని ప్రతిభకు కాదని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే దివ్యాంగులు సైతం అద్భుతాలు సృష్టిస్తారని ఉపాధ్యాయులు వెంకటేశం తెలిపినారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రమా ఉపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డి రాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ పత్రిక



## మేడ్చల్ మారుతి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

-అన్నదాన కార్యక్రమనికి భారీ స్పందన

మేడ్చల్ తెలంగాణ పత్రిక 19:





మేడ్చల్ డివిజన్ పరిధిలోని మారుతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి భవాని రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల కు భోజనం వడ్డిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం చేయడం సంతోషకరమైన విషయమని నిర్వాహకులు పేర్కొన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించేందుకు యువత ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎర్ర విజయరావు, ఓం రాజ్‌తో పాటు మారుతి యూత్ అసోసియేషన్ సభ్యులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. నిర్వాహకులు చేసిన ఏర్పాట్లను పాల్గొన్న వారు అభినందిం గ్చార్గయు వత, ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్యక్రమానికి సహకరిం చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## వేములవాడ సింగిల్ విండో చైర్మన్‌గా వకుళభరణం శ్రీనివాస్ నియామకం

వేములవాడ, సెప్టెంబర్,19, తెలంగాణ పత్రిక.



వేములవాడ సింగిల్ విండో కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నూకలమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వకుళభరణం శ్రీనివాస్ నియమితులయ్యారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న ఆయనకు స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు మరియు సహకార సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వకుళభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ.తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, నాయకులకు మరియు సొసైటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతుల సంక్షేమమే ధ్యేయంగా, సొసైటీ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని, సహకార సంఘం సేవలను మరింత వేగవంతం చేసి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు.

## సనుగుల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఏగోళం శ్రీనివాస్

చందుర్తి, సెప్టెంబర్, 19, తెలంగాణ పత్రిక.



చందుర్తి మండలం సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఏగోళం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటన వెలువడింది. నూతన చైర్మన్‌గా నియమితులైన ఏగోళం శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆయనకు హృద యపూ ర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏగోళం శ్రీనివాస్ మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి సనుగుల సహకార సంఘం చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, రుణాలు అందేలా చూస్తానని, సహకార సంఘాన్ని లాభాల బాటలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు.

### గణేష్ గడ్డ ఆలయ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మీనా ఎల్ రాజు గౌడ్ దంపతులు.

రేగోడు, తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19:



మండల కేంద్రమైన రేగోడు లోని గణేష్ గడ్డ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి వద్ద మీనా ఎల్ రాజు గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదంతో పాటు అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వరసిద్ధి కర్ర వినాయకునికి పోటెత్తిన భక్తులు







తానూర్:19సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)

మండలంలోని భోసిలో గ్రామంలో నెలకొల్పిన కోర్కెలు తీర్చే కర్ర వినాయకుని దర్శించుకునేందుకు శనివారం భక్తులు బారులు తీరారు. తెలంగాణ తోపాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆయా గ్రామల నుంచి భక్తులు కాలినడకన వచ్చే స్వామివారి దర్శనం చేసుకుని భజనలు, భక్తి గీతాలపై సంప్రదాయ నృత్యాలు చేసి తమ కోర్కెలు తీర్చాలని ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయం హోమంలో దంపతులు పాల్గొన్నారు. శ్రీ నాగభూషణం విద్యాలయం బాసర, వికాస్ హై స్కూల్ బైంసా, విద్యార్థుల సంస్కృతిక, నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీమారుగొండ గంగాధర్‌ఏనారయణభోసి గారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు. చేశారు

## పెంచిన యూపీఐ చార్జీలు వెంటనే ఉపసంహరించాలి

-సామాన్యులపై అదనపు ఆర్థిక భారం మోపొద్దు: సీఐటీయూ

తెలంగాణ పత్రిక దమ్మపేట, సెప్టెంబర్ 19



డిజిటల్ చెల్లింపులపై పెంచిన యూపీఐ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. శనివారం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తూ యూపీఐ వ్యవస్థను విస్తరించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు చార్జీల పేరుతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, రైతులు, చిన్న వ్యాపారులు, కూరగాయలు--పండ్ల వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, అసంఘటిత కార్మికులు సహా కోట్లాది మంది రోజువారీ లావాదేవీలకు యూపీఐపై ఆధారపడుతున్నారని తెలిపారు. చిన్న దుకాణాల నుంచి పెద్ద వ్యాపారాల వరకు యూపీఐ చెల్లింపులు నిత్యజీవితంలో భాగమయ్యాయని, ఇలాంటి ప్రజావినియోగ వ్యవస్థపై అదనపు చార్జీలు విధించడం సామాన్యులపై భారాన్ని పెంచడమేనని అన్నారు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించి, ప్రజలను డిజిటల్ చెల్లింపుల వైపు మళ్లించిన ప్రభుత్వం ఇప్పుడు అదే వ్యవస్థపై చార్జీలను పెంచడం వల్ల సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రజలపై అదనపు భారాన్ని మోపే నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించి, పెంచిన యూపీఐ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురారి రఘు, విక్రమ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వరసిద్ధి కర్ర వినాయకునికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే పూజలు

తానూర్:సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక)





మండలంలోని భోసి గ్రామంలో కొలువుదీరిన శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుడిని శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దర్శించుకున్నారు. ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి,మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఆశీస్సులు తీసుకున్న మైనంపల్లి హనుమంతరావును ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్ , సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గ్రామంలో కర్ర వినాయకుడి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న తీరును ఆయన అభినందించారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి :: జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

-ఈ నెల 27న రాయికల్ శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలు

-"డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్‌రూపకల్పన" ఈ ఏడాది థీమ్

రాయికల్ మండల సెప్టెంబర్ 19(తెలంగాణ పత్రిక ):





ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లాలోని జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కేంద్రంలో శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 2026 సంవత్సరానికి "డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్‌రూపకల్పన" అనే థీమ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 09న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్‌లోని శ్రీ చెన్నకేశవ నాథ ఆలయం (త్రికూటాలయం)లో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు .

## నర్సాయిగూడెంలో ఘనంగా గణేష్ అన్నదానం

తెలంగాణ పత్రిక వలిగొండ మండలం సెప్టెంబర్ 19



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సాయిగూడెం గ్రామంలో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నర్సాయిగూడెం మాజీ సర్పంచ్ తుమ్మల దామోదర్ సమక్షంలో తుమ్మల శ్రీనివాస్ దంపతులు, కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం అందించారు. ముందుగా వేద పండితుల సమక్షంలో గణేష్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ గణేష్ మహారాజ్ ఆశీస్సులు వలిగొండ మండల ప్రజలకు, నర్సాయిగూడెం గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణేష్ మహారాజ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు. కీర్తిశేషులు తుమ్మల నరసయ్య కుటుంబ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. తుమ్మల ఆనంద్, తుమ్మల సంతోష్, పసల ఇన్నయ్య, ఇన్సెంట్ జాన్డు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. గణేష్ మండపం వద్ద భక్తుల సందడి నెలకొనగా, అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది.

# ఎస్ ఎం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నప్రసాద కార్యక్రమం

-గణనాధునికి ప్రత్యేక పూజలు చేసిన యూత్ సభ్యులు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19





రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎస్ఎం యూత్ వద్ద శుక్రవారం రాత్రి మహా అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎస్ఎం యూత్ సభ్యులు ఆకాంక్షించారు ఎస్ఎం యూత్ సభ్యులు మాట్లాడుతూ 6సంవత్సరాల నుండి గణేష్ నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు గణనాథుడికి ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో 9 రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అందులో భాగంగా అన్నప్రసాద కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు అన్నదానం మహాదానం అని అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయం అందించాలని వారు పిలుపునిచ్చారు. గణనాధుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎం యూత్ సభ్యులు అక్క పెల్లి నాగరాజు. నేవూరి కోటయ్య గారి సంతోష్ రెడ్డి. పిన్నింగారి రాజు. చెల్లాపురం గణేష్. గడ్డం బాలు. గంట రాజు. మద్దికుంట హరీష్. గంట చిన్న రాజు. వేషాల చిన్నరాజు. రంజిత్ రెడ్డి. పాటి రాజు. శ్రీకాంత్ తోపాటు సభ్యులు గ్రామస్తులు పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు

# అమీన్‌పూర్ రోడ్డుపై మౌలిక వసతుల పనులకు వేగం

-రోడ్డు విస్తరణ, వంతెనలు, డ్రైనేజీ, వరదల నివారణపై క్షేత్రస్థాయి పరిశీలన

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, సెప్టెంబరు 19,(తెలంగాణ పత్రిక)





ఎన్‌హెచ్--65 నుంచి అమీన్‌పూర్ వరకు చేపట్టిన రహదారి విస్తరణ, అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధి పనులపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన జరిగింది. మెదక్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, సీఎంసీ, ఇరిగేషన్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు పరిశీలనలో పాల్గొన్నారు. అమీన్‌పూర్ రహదారి విస్తరణతో పాటు వంతెనల అనుసంధానం, డ్రైనేజీ సామర్థ్యం, వర్షపు నీటి ప్రవాహం, వరదల నివారణ చర్యలు, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతులపై అధికారులు సమగ్రంగా సమీక్షించారు. రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు వర్షపు నీటి నిర్వహణకు శాశ్వత పరిష్కారాలు చేపట్టాల్సిన అవసరంపై చర్చించారు.

**బండం కొమ్ము చెరువు వద్ద వంతెన ప్రతిపాదన**

బండం కొమ్ము చెరువు వద్ద వంతెన నిర్మాణ ప్రతిపాదనను పరిశీలించాలని నిర్ణయించారు. చెరువు హద్దులపై తుది నిర్ణయం అనంతరం సీఎంసీ ఆధ్వర్యంలో వంతెన ప్రతిపాదన రూపొందించి, దానికి అనుగుణంగా రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) ను సవరించనున్నారు.

**మేజర్ నాలాపై డ్రోన్ సర్వే**

మేజర్ నాలా పనులకు సంబంధించి డ్రోన్ సర్వే, కన్సల్టెన్సీ అధ్యయనం నిర్వహించి, అవసరమైన ప్రాంతాల్లో బాక్స్ డ్రెన్లు, రిటైనింగ్ వాల్స్ తదితర నిర్మాణాలను ప్రతిపాదించనున్నారు. ఈ పనులను ఎస్ఎన్‌డీపీ ఫేజ్--3లో చేర్చే అంశాన్ని పరిశీలించనున్నారు.

**కల్వర్టు విస్తరణకు ప్రతిపాదన**

జ్యోతి థియేటర్ సమీపంలోని నల్లగండ్ల సర్‌ప్లస్ నాలాపై ఉన్న కల్వర్టును ఎస్ఎన్‌డీపీ ద్వారా విస్తరించే అంశంపైనా అధికారులు చర్చించారు. అమీన్‌పూర్ ఎస్‌టీపీ, సీవర్ మెయిన్ డైవర్షన్‌కు సంబంధించిన అవసరాలను హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ పరిశీలించనుంది.

**ఎఫ్‌ఓబీ, బస్ షెల్టర్ ఏర్పాటుపై సమన్వయం**

జ్యోతి థియేటర్ సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ), బస్ షెల్టర్ ఏర్పాటుకు సంబంధించి జాతీయ రహదారి అధికారులతో సీఎంసీ సమన్వయం చేయనుంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులు సూచించారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

వినాయక్ నగర్ కల్వర్టు పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని సీఎంసీ కమిషనర్ పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యానికి ఇబ్బందులు కలగకుండా చెత్త తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రహదారి అనుసంధానం, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, వరదల నివారణ, వంతెనల నిర్మాణం, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు, అధ్యయనాలను సంబంధిత శాఖల సమన్వయంతో వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు..

# శంషాబాద్‌లో పాలమాకుల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

-కల్వర్టును ఢీకొన్న కారు.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

రాజేంద్ర నగర్ ప్రతినిధి,సెప్టెంబర్ 19 తెలంగాణ పత్రిక





రంగా రెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల వద్ద జాతీయ రహదారిపై తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పాల్మాకుల సమీపంలో వేగంగా వెళ్తున్న ఇన్నోవ కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.. మృతులను నవాబ్‌పేట మండలం చౌదూరుకు చెందిన జమున, మాన్సింగ్, కేతావత్ లింబ్య, వాస్రామ్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమా? లేక డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గంభీరావుపేటలో నార్కోటిక్ డాగ్స్‌తో ముమ్మర తనిఖీలు







-మత్తు పదార్థాలపై పోలీసుల ఉక్కుపాదం

-మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా మండలంలో విస్తృత తనిఖీలు.. ఎస్సై శ్రీకాంత్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండలంలో పోలీస్ సిబ్బంది ప్రత్యేకంగా నార్కోటిక్ డాగ్స్‌తో స్థానిక టీ కొట్లు, కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో ముమ్మరంగా సోదాలు నిర్వహించారు ఈసందర్భంగా పలు దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగంపై స్థానికులను నిర్వాహకులను ఆరా తీశారు ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు గ్రామాలు, మండలాల్లో ఎక్కడైనా అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.గంభీరావుపేట మండలం ను సంపూర్ణంగా 'డ్రగ్‌ఫ్రీ' మండలంగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు

## పాపన్నపేట మార్కండేయ గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం



పాపన్నపేట,సెప్టెంబర్ 19:(తెలంగాణ పత్రిక)

పాపన్నపేట మండల కేంద్రంలోని మార్కండేయ గణేష్ మండపం వద్ద గణపతి ఉత్సవాలు భక్తి శ్రద్దలతో ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం పాపన్నపేట చేనేత సహకార సంఘం అధ్యక్షులు కొడుపాక విఠల్ గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ప్రత్యేక ఆకర్షనీయమైన పూలతో విశేష అలంకరణ చేసిన గణేష్ మండపంలో కొడుపాక విఠల్,కొడుపాక రాజేష్ కుటుంబ సభ్యులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అన్నదాన కార్యక్రమంను గణేష్ మండలి కమిటీ సభ్యులు కొడుపాక శివశంకర్,బీకొండ సంపత్,మదనాల అరవింద్,బీకొండ సాయికిరణ్, అచ్చుకట్ల మహేష్, చామంతుల అరవింద్, వళ్ళందేశి మహేష్,పల్లె ప్రసాద్,వళ్ళందేశి ఉదయ్ కిరణ్,బోనకుర్తి దీపక్,పల్లె సాయికిరణ్,పడిగే శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా ఈపూజ కార్యక్రమంలో పద్మశాలి కులస్థులు కొడుపాక విఠల్,పల్లె సంగమేశ్వర్,వళ్ళందేశి శ్రీనివాస్,పడిగే కృష్ణ, బద్దాపురం సంగమేశ్వర్, కొడుపాక ఉమామహేశ్వర్, పల్లె లక్ష్మణ్,కల్లేటి యుగేందర్, పల్లె రాజు,తూర్పు రాజు, దాసరి యాదగిరి,అచ్చుకట్ల గురునాథ్,తూర్పు రాము, కొడుపాక దుర్గేష్, కొడుపాక పూర్ణచందర్, రాజారాం చంద్రం, వళ్ళందేశి మునీందర్, చామంతుల నాగరాజు, కొడుపాక రాజేష్, వళ్ళందేశి రాజు పెద్దలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గణపయ్య ఆశీర్వచనాలు పొందారు. అనంతరం గణేష్ మండపం వద్ద భక్తి పాటలతో భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## గర్భిణీలకు శ్రీమంతం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం



జగిత్యాల, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల రూరల్ మండల్ మోరపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలలో జాతీయ పోషణ మాసంలో భాగంగా ఆరోగ్య వంతమైన పిల్లల తల్లులు పోషణ లోపం ఉన్న పిల్లల తల్లుల మధ్య అనుభవం పంచుకునే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం గర్భిణీలకు శ్రీమంతం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్ ఉప సర్పంచ్ అగునూరి గంగరాజం వార్డు మెంబర్లు కొక్కుల గణేష్ కుర్మా తిరుపతి గ్రామ కార్యదర్శి హుమేరా డాక్టర్ అనూష ఐసిడిఎస్ సూపర్వైజర్ లావణ్య ఏఎన్ఎం శ్రీశైల శిరీష అంగన్వాడి టీచర్లు సంకోజి పద్మారాణి జమున శైలజ ఆశ కార్యకర్త హేమలత గర్భిణీలు పిల్లల తల్లులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమం




గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ బాయ్స్ పాఠశాల నందు నో బ్యాక్ డే పురస్కరించుకొని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివిధ ప్రక్రియలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు తెలంగాణ యాసలో పదాల సేకరణ, ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ పై రచనలు, ఆంగ్ల భాషలో క్విజ్, నిత్యజీవితంలో గణితం, ల్యాబ్ యాక్టివిటి, ఏక్ పేడ్ మాకా నామ్ పే, సిరిసిల్ల జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి సలహాలు సూచనలు అనే కార్యక్రమాలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



రేగోడు, తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు మున్నూరు కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దిగంబర రావు, మాజీ కోఆప్షన్ సభ్యులు చోటు మియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన డీ.సీ.పీ

-నిమజ్జనం తొర్రూరు చెరువు వద్ద

పాలకుర్తి, సెప్టెంబర్ 19(తెలంగాణ పత్రిక):





డీసీపీ వెస్ట్ జోన్ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్ శనివారం రోజు తొర్రూరు (జె) గ్రామంలోని చెరువును గణేష్ నిమజ్జనానికి ఎంపిక చేసిన కారణంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు సిబ్బందికిసూచించారు. పాలకుర్తి గ్రామంలో ప్రతి సంవత్సరం నిమజ్జనం నిర్వహించే కోనమ్మకుంట లో నీరు లేని కారణంగా ఈ సంవత్సరం గణేష్ నిమజ్జనం తొర్రూరు (జె) చెరువు వద్ద నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.అనంతరం పాలకుర్తిలోని గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ భరత్, ఎస్ఐ పవన్ కుమార్, పాలకుర్తి పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ వెంకన్నబాబు

-నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19





జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం నాడు ఇల్లందు పోలీస్ స్టేషన్లో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ వెంకన్నబాబు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఎవరైనా బెదిరింపులు, దాడులు, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు తమ గత నేర చరిత్రను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవిస్తూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని డీఎస్పీ వెంకన్నబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, సత్యనారాయణ, ఎస్సైలు తిరుపతి, ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దాపూర్‌లో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక

– గ్రామాభివృద్ధి పనుల గుర్తింపుపై గ్రామసభలో చర్చ



ఆత్మకూరు సెప్టెంబర్ 19, (తెలంగాణ పత్రిక):



పెద్దాపూర్ గ్రామపంచాయతీలో విబిజి రామ్‌జీ-- వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక తయారీపై శనివారం డెమో నిర్వహించారు. రైతు వేదిక ఆవరణలో గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్తుల సహకారంతో సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్‌లను రూపొందించారు. గ్రామానికి అవసరమైన పనులను 375 రకాల పనుల్లో ఎలా గుర్తించాలి, ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, వాటిలోని లోటుపాట్లను గుర్తించి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, ఈసీ రాము, సర్పంచ్ రవి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చెంత న్యాయ అవగాహన సదస్సు

-ఆదివాసీల కు అవగాహన

-అతి దట్టమైన అడవుల్లోకి న్యాయాధికారి

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక)



మండలంలోని నిగిని, బాబేర తండా, కైలాస్ టెక్డి గ్రామాలలో శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ కైలాస శిఖరంగా పేరొందిన కైలాస్ టేక్డి వద్ద గల శివుడు కొలువై ఒకవైపు చుట్టూ పచ్చని సయాద్రి పర్వతాల గొలుసు కట్టు సొబగులు మరొకవైపు అంతా అతి దట్టమైన అడవిలో బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కే సందీప్ కుమార్ అక్కడి ప్రాంతాల ప్రజలకు హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడుకుంటూ, తమ మనగడకు అవసరమైన హక్కులు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా చట్టాలను గౌరవిస్తూ నడుచుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఆధ్యాత్మికత మార్గంలో ప్రయాణిస్తూ పల్లె గ్రామీణ జనం ప్రతి ఒక్కరూ ఇక్కడి పచ్చని ప్రకృతిని సైతం కాపాడుకోవాలని, అడవి అమ్మ వంటిదని, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ జి పి పంద్రం శంకర్, న్యాయవాది కుమ్మరి విజయ్ కుమార్, లింభాజీ మహారాజ్, సర్పంచులు, రూప్ చంద్, జాదవ్ పద్మా రవి, మాజీ సర్పంచ్ బద్రు, బందు పటేల్, జైత్రం, గంగయ్య బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

# త్రిబుల్ ఆర్ రోడ్డులో భూమి కోల్పోతున్న రైతులు చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేత

తెలంగాణ పత్రిక వలిగొండ మండలం సెప్టెంబర్ 19:

- భూ నిర్వాసితుల జేపీసీ కన్వీనర్ వారాల శేఖర్ రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంఘం గ్రామ పరిసరాల రైతులు చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గౌరెల్లి--భద్రాచలం నేషనల్ హైవే నిర్మాణం కోసం పోచంపల్లి, వలిగొండ మండలాల్లో భూసేకరణ చేసిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. న్యాయమైన పరిహారం నిర్ణయించే వరకు తమ భూముల్లో రహదారి నిర్మాణ పనులు చేపట్టవద్దని రైతులు విజ్ఞప్తి చేశారు. అర్బిట్రేషన్ ద్వారా భూసేకరణ పరిహారాన్ని పునఃపరిశీలించి సముచితంగా న్యాయం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఎకరాకు సుమారు రూ.11 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు మాత్రమే నష్టపరిహారం అందించినారని రైతులు తెలిపారు. అదే భూములకు ఓపెన్ మార్కెట్‌లో ఎకరాకు రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు విలువ ఉందని పేర్కొన్నారు. కనీసం రూ.38 లక్షల నుంచి రూ.1.20 కోట్ల వరకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. పోచంపల్లి, వలిగొండ మండలాల భూబాధిత రైతులకు నిర్ణయించిన పరిహారాన్ని ప్రస్తుత మార్కెట్ విలువల ఆధారంగా పునఃపరిశీలించాలని కోరారు. భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన, సముచితమైన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆర్డీవోకు వివరించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కందుల తానేష్ గౌడ్ జంగారెడ్డి మహేందర్ రెడ్డి బీ జంగయ్య వెంకటరెడ్డి వలిగొండ మండలం పోచంపల్లి మండలం రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పాపన్నపేట పాతూర్ లో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన.. ఘనంగా అన్నదానం

పాపన్నపేట, సెప్టెంబర్ 19:(తెలంగాణ పత్రిక)





పాపన్నపేట మండలం కేంద్రంలోని పాతూర్ హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపంలో శనివారం మహిళలు భక్తిశ్రద్ధలతో మార్చిన పూజలు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించారు ప్రత్యేక పూజా కార్యక్రమంతో మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండప ప్రత్యేక పూజారి చెరువులపల్లి నవీన్ శర్మ ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం మహిళలతో కుంకుమార్చన పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామివారికి కుంకుమార్చన నిర్వహించి, కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. పూజా కార్యక్రమం సందర్భంగా మండప పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పాపన్నపేటలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాపన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దోసని సంగమేశ్వర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయకుడి దర్శనానికి వచ్చిన భక్తులను, స్థానికులకు అన్న ప్రసాదాన్ని అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు సహారా యూత్ యువజన సంఘం సభ్యులు గొల్ల విష్ణు దంపతులు వినాయకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, యువజన సంఘం సభ్యులు, స్థానికులు సహకరించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా మంటపం వద్ద ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# రాయికల్ పట్టణ ప్రజలకు లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

-ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

-30 లక్షలతో నాలుగు డీటీఆర్‌ల ఏర్పాటు

జగిత్యాల, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు అన్నారు. మండలంలో గృహజ్యోతి పథకం అమలుకు సుమారు 11.70 కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కోసం అవసరమైన డీడీ చెల్లించిన వారికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాకు చర్యలు ఈ వర్షాకాలంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పీక్ స్థాయికి చేరినప్పటికీ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్ అందించేందుకు 14 రూపాయలకు యూనిట్ చొప్పున ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఉచిత విద్యుత్‌తో పాటు రుణమాఫీ రైతుభరోసా తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాయికల్ పట్టణ మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మైతాపూర్ రామాజీపేట బ్రిడ్జి పనులు పూర్తి చేశామని మిగిలిన అప్రోచ్ రోడ్డు పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా రాయికల్ పట్టణ మండల అభివృద్ధి మాత్రం ఆగదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సర్పంచులు రాయికల్ పట్టణ మండల నాయకులు విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాల మాడల్ పాఠశాలను ఆకస్మికంగా తను చేసిన అల్లాదుర్గం కోర్ట్ జడ్జి ఏసుచరిత

రేగోడు, తెలంగాణ పత్రిక ,సెప్టెంబర్ 19:





మండల కేంద్రమైన రేగోడు లోని కస్తూర్బా గాంధీ పాఠశాల, మోడల్ పాఠశాలను శనివారం అల్లాదుర్గం కోర్టు జడ్జి ఏ సుచరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకోవాలని , విద్యార్థినీయుల చదువు పట్ల టీచర్లు శ్రద్ధ చూపాలని తెలిపారు, అదేవిధంగా విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలని హాస్టల్లో నీ ప్రిన్సిపల్ లకు తెలిపారు. హాస్టల్లోని వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరెంట్ నాగరాజు, తాసిల్దార్ దత్తారెడ్డి, ఎస్ఐ పోచయ్య, మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ స్వయంప్రభ, సిబ్బంది పాల్గొన్నారు .

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 9వ వార్డులో ఇరవేణి రమ్య సతీష్ దంపతులకు ఇల్లు మంజూరు కాగా శనివారం రోజున ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి స్థానిక వార్డు సభ్యురాలు అక్కపెల్లి శిరీష నాగరాజ్ హాజరయ్యారు ముఖ్య అతిథులుగా పదో వార్డు సభ్యురాలు అక్క పెల్లి లతా బాలయ్య కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు హామీద్ లక్కం నాంపల్లి వేషాల వెంకటి హాజరైనారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఎంతో భరోసానిస్తుందని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ జరగడం లబ్ధిదారుల కుటుంబంలో ఆనందాన్ని నింపిందని, సొంతింటి కల నెరవేరే దిశగా ఇది తొలి అడుగు అని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ శంకర్ పెద్దవేని మల్లయ్య, గంద్యాడపు శంకర్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లారీని వెనుక నుండి ఢీకొని డ్రైవర్ మృతి

**-ఆత్మకూరు మండలం గుడెపాడ్ క్రాస్ వద్ద ఘటన**

**ఆత్మకూరు, సెప్టెంబర్ 19: (తెలంగాణ పత్రిక) :**

ఆత్మకూరు మండలం గుణపాడ్ క్రాస్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆత్మకూర్ సిఐ బాబులాల్ కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం రాపాకపల్లి గ్రామానికి చెందిన కనకం శరత్‌కుమార్ (28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శరత్‌కుమార్ హనుమకొండకు చెందిన ఎండి రుక్ముద్దీన్‌కు చెందిన అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం (టీజీ 03 టీ 2958)ను గోవర్ధనగిరిలోని శక్తి డైరీ మిల్క్‌కు అనుసంధానంగా నడుపుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి పాలు, పాల పదార్థాలను వివిధ ప్రాంతాలకు సరఫరా చేసి, రాత్రి పరకాల బస్టాండ్ సమీపంలోని శక్తి డైరీ అవుట్‌లెట్‌లో సరుకు దింపి హనుమకొండకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో రాత్రి సుమారు 8 గంటల సమయంలో గుణపాడ్ క్రాస్ దాటి ఎన్ఎస్ఆర్ హోటల్ సమీపంలోని జాతీయ రహదారి-163పైకి చేరుకున్నాడు. అక్కడ భూపాలపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే రహదారిపై ఎలాంటి హెచ్చరిక సూచనలు, సంకేతాలు లేకుండా లారీ (టీఎస్ 07 యూకే 1718) నిలిపి ఉంచినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ లారీని గుర్తించలేక శరత్‌కుమార్ తన వాహనంతో వెనుక భాగంలో ఢీకొనడంతో వాహనం ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. శరత్‌కుమార్‌కు తలతో పాటు శరీరంలోని ఇతర భాగాల్లో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనను గమనించిన ప్రత్యక్ష సాక్షి తనుగుల సందీప్ సమాచారాన్ని వాహన యజమానికి అందించగా, యజమాని రుక్ముద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు ఎంజీఎం మార్చురీకి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడుకు చెందిన కొనుపుల హరీష్‌గా గుర్తించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లారీని నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి కనకం ప్రసాద్ ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆత్మకూరు సీఐ బాబులాల్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

# తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన తాటి వెంకటేశ్వర్లు

**తెలంగాణ పత్రిక దమ్మపేట సెప్టెంబర్ 19**

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నప్పటికీ సమావేశానికి కేవలం 25 మంది తల్లిదండ్రులు మాత్రమే హాజరుకావడం బాధాకరమన్నారు. తమ పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారు, వారి విద్యా ప్రగతి ఏ విధంగా ఉంది, చదువులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. పిల్లల విద్యా ప్రగతిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు ఉపాధ్యాయులతో నిరంతరం సంప్రదిస్తూ ఉండాలని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారి నైపుణ్యాలను వెలికితీసేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసి పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందుతున్న విషయాన్ని గుర్తించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి నెల నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరై తమ పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇంటి స్థలాల రిలే నిరాహార దీక్ష కు సంఘీభావం

**మాడుగులపల్లి//నల్గొండ//సెప్టెంబర్ 19:(తెలంగాణ పత్రిక):-**

జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మాడుగులపల్లి మండలానికి చెందిన పత్రికా విలేకరులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మాడుగులపల్లి మండల అధ్యక్షుడు షేక్ . రసూల్, ప్రధానకార్యదర్శి దర్శనం రాంబాబు మాట్లాడుతూ జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ, హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని డిమాండ్



చేశారు జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి మండల విలేక రులు బొంగరాల శ్రీనివాస్, చక్రపాణి, గంట రవి, పెరమళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# లోకకల్యాణమే లక్ష్యంగా పాదయాత్ర సాగాలి

**-పర్యావరణ పరిరక్షణే సమాజానికి రక్షణ**
**-శాంతి, ఐక్యతలతోనే సమాజ ప్రగతి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):**

లోకకల్యాణం, మానవాళి శాంతి, ఐక్యతే లక్ష్యంగా సాగుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా ఆకాంక్షించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నుంచి తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రం వరకు సుమారు 600 కిలోమీటర్ల మేర చేపట్టిన 'భద్రాద్రి రాముడు టు గోవిందుడు' పాదయాత్ర బృందానికి భద్రాద్రి జిల్లా సరిహద్దులో మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన



ఘనంగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. సర్వజనుల సంక్షేమం, మానవ సమాజంలో శాంతి నెలకొల్పాలనే సంకల్పంతో పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక సాధనతో పాటు సమాజ హితం కోసం ప్రతిరోజూ ఒక మొక్కను నాటుతూ, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవడం పర్యావరణ పరిరక్షణపై ఉన్న చైతన్యానికి నిదర్శనమన్నారు. భక్తిభావానికి సామాజిక బాధ్యతను జోడించి చేపట్టిన ఈ పాదయాత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, వై. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మురళి, సనత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోరంటాలలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో శుక్రవారం రోజున ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు నాయకులు మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ఉప సర్పంచ్ బుచ్చ గారి అంజాయ్య, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి ఫాక్స్ డైరెక్టర్ రాగుల అంజిరెడ్డి అన్నారు ఆపద సమయంలో ప్రభుత్వ సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అవసరమైన అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సహకారం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రఘువీరా ప్రసాద్ భాస్కర్ వార్డు మెంబర్లు ఎర్రం రవీందర్ ఆంజనేయులు దేవరాజు బందెల నర్సయ్య, మరియు లబ్ధిదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే ముఖ్యం



**జగిత్యాల, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):**

జగిత్యాల రూరల్ మండల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వంజరిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు నేరాల నియంత్రణకు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతయని తెలిపారు. గ్రామ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగామల్లయ్య, జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్ పోలీస్ సిబ్బంది ప్రజా ప్రతినిధులు వంజరిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ ప్రజలకు ప్రజా ప్రతి నిధులకు పోలీస్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## ముధోల్ రాజా రాణి వైన్స్ వద్ద గ్రామస్తుల ఆందోళన




**ముధోల్:19సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)**

మండల కేంద్రంలోని రాజారాణి వైన్స్ వద్ద శనివారం గ్రామస్తులు ఆందోళన చేశారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలోని యూత్ సభ్యులు చందాలు ప్రతి ఏడాది మాదిరిగా ఇవ్వాలని అడిగారు. దీంతో శనివారం ఆఖరి రోజు కావడంతో ఆయా గణేష్ మండలి యూత్ సంఘాల సభ్యులు డబ్బుల కోసం వైన్స్ వద్దకు వెళ్లారు. సదరు రాజారాణి వైన్స్ సిబ్బంది ఏలాంటి చందాలను ఇవ్వమని యూత్ సంఘాల సభ్యులకు తెలియజేయడంతో ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వైన్స్ వద్దకు వచ్చి యూత్ సభ్యులను సముదాయించారు. అయినప్పటికీ వినకపోవడంతో వీడిసి సభ్యులు వైన్స్ యజమానికి ఫోన్ ద్వారా మాట్లాడడంతో యూత్ సభ్యులు వెనుదిరిగారు. గణేష్ నిమజ్జనం ఆదివారం ఉండడంతో శనివారం సాయంత్రం వరకు వైన్స్ దుకాణాలు బంద్ అవుతాయన్న విషయం తెలవడంతో వైన్స్ వద్ద జనాలతో సందడిగా ఏర్పడింది.

# మున్సిపల్ కార్యాలయం గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు శోభాయాత్ర



**జగిత్యాల, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):**

వినాయక నవరాత్రుల సందర్భంగా జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణిశ్రీనివాస్ కమిషనర్ సత్య ప్రణవ్ కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు అధికారులు సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథునికి ఉత్తర పూజలు చెసి అన్నదానం నిర్వహించి భక్తి శ్రద్ధలతో శోభాయాత్రలో మున్సిపల్ కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని పూజలో పాల్గొన్న జేకే శేఖర్ యాదవ్



**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19:**

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడలోని సత్తిరెడ్డి కాలనీలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని పూజా కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్, మాజీ అధ్యక్షుడు రమేష్, సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, జీఎస్ జనరల్ సెక్రటరీ సీనన్న, ఓబీసీ మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రావణ్, సీనియర్ నాయకుడు చంద్రప్రకాశ్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమానికి ఆహ్వానించిన నాయకులు, కార్యకర్తలకు ఓబీసీ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యాలయ జాయింట్ సెక్రటరీ బి. తేజస్విని కృతజ్ఞతలు తెలిపారు.

# వర్ని సిసిడిలో ఈనెల 23న ఎమ్మార్పీఎస్ మండల కమిటీలు ఏర్పాటు

**-బాన్సువాడ నియోజకవర్గ ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ పోచిరాం వెల్లడి.**



**కోటగిరి తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19.**

నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా ఇన్చార్జి మాసాయిపేట యాదగిరి నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ సోంపుర్ పోచిరాం మాదిగ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈ నెల 23న ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సీసీడి ఫంక్షన్ హాల్ వద్ద మాదిగ సోదరులు అందరూ వచ్చి మండల నూతన కమిటీలను ఎన్నుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి మాసాయిపేట యాదగిరి మాదిగ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ని మండల ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు సంగోల అశోక్ మాదిగ సాధన కార్యక్రమం సామేన కాశీరాం మాదిగ ఈబాత్వార్ రాజు మాదిగ మీరుగా మీరు రాజయ్య మాదిగ గంధం సాయిలు మాదిగ ప్రభాకర్ మాదిగ సాయిలు మాదిగ శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకం



**ముధోల్: 19సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)**

విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలక మని ప్రముఖ వక్త లింగంపెల్లి సుభాష్ అన్నారు. శనివారం సారంగాపూర్ మండలంలోని ఆలూరు పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. విద్యార్థి దశ ఎంతో విలువై ందని క్రమశిక్షణతో చదువుకున్న ట్లయితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చున్నారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయపాలన, ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను నిరాశ చెందకుండా ప్రయత్నిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చుని ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థు లు పాల్గొన్నారు

# మెదక్ జిల్లా కు కేంద్రీయ విద్యాలయం

**-మెదక్ జిల్లా విద్యార్థులకు ఒక వరం**

**-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

**మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 19 సెప్టెంబర్**





జిల్లాలో తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు అనువైన పాఠశాల భవనాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ చాంబర్లో కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ , సంతోష్ కుమార్ , అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎ. ఇజ్రాయల్, అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తో కలిసి సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా వసతులను పెంచేందుకు క్రమంగా కొత్త విద్యాలయాలను మంజూరు చేస్తోంది అని ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసిందని , మెదక్ జిల్లాలో నూతన కేంద్రీయ విద్యాలయ నెలకొల్పేందుకు హవేలీ ఘనపూర్ మండలంలో వై పి ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ పరిసర ప్రాంతాలలో 06 ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. అందులో భాగంగా మెదక్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలి కంగా ప్రారంభించేందుకు అనువైన విద్యాలయ భవన సముదాయాలను గుర్తించాలని, గుర్తించిన వెంటనే కేంద్రీయ విద్యాలయం తాత్కాలికంగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని నూతన కేంద్రీయ విద్యాలయం నిర్మాణం పూర్తయిన వెంటనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయాన్ని నూతన భవనాల్లోకి తరలించే విధంగా భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మెదక్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయ నెలకొల్ప డానికి భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, గణాంక అధికారి నవీన్, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మైనారిటీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**-తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అబ్దుల్ అమీద్**

**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక)19 సెప్టెంబర్**



మైనారిటీల సామాజిక, ఆర్థిక మరియు విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అబ్దుల్ అమీద్ అన్నారు. శనివారం మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ వీడియో సమావేశ హాల్లో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తాసిల్దారులు మైనారిటీ సంక్షేమ అధికారులతో జిల్లాలో మైనార్టీలకు అమలవుతున్న పథకాలు, షాదీ ముబారక్, కళ్యాణ్ లక్ష్మి, విద్యార్థులకు స్కాలర్షిప్ షాది ఖానాలు సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అబ్దుల్ అమీద్ మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారుల దరఖాస్తులను పరిష్కరించి, ఎంక్వైరీ నిర్వహించి, వారికి లబ్ధి చేకూర్చాలన్నారు, అలాగే మైనారిటీ విద్యార్థుల స్కాలర్షిప్ అందించే విషయంలో ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ముందుకు పోవాలన్నారు జిల్లా పరిధిలోని మైనారిటీ విద్యాసంస్థలు మరియు వక్ఫ్ భూముల రక్షణకు సంబంధించిన అన్ని విషయాల్లో పురోగతి కనపడాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖకు కేటాయి ంచిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగిం చుకోవాలని మరియు అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని అన్నారు. నిరుద్యోగ మైనారిటీ యువత, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు మరియు ఆర్థిక సహాయం అందించే లా చర్యలు తీసుకోవాలన్నారు షాదీ ఖానాల నిర్మాణం విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మైనారిటీ సంక్షేమ అధికారి ఉపేందర్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూప్రాన్ బాలయ్య, నర్సాపూర్ రామకృష్ణ, సంబంధిత తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మహాభోగ్ భండారో పూజా కార్యక్రమంపై విస్తృత సమావేశం

**తెలంగాణ పత్రిక - బొంరాస్‌పేట్:**



మండలంలో సెప్టెంబర్ 20న నిర్వహించనున్న సత్గురు సేవాలాల్ మహారాజ్ మహాభోగ్ భండారో పూజా కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం సాయంత్రం సన్నాహక సమావేశం నిర్వహించారు. బంజారా సోదరులు, వివిధ తాండాల గుడి పూజారులు, పెద్దలు, గోర్ సిక్వాడి రాష్ట్రీయ గోర్ సేనా కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహించాలి, వివిధ తాండాల నుంచి వచ్చే సభ్యులతో ఎలా సమన్వయం చేసుకోవాలి అనే అంశాలపై సమావేశంలో చర్చించారు. మహాభోగ్ భండారో పూజా కార్యక్రమానికి వివిధ తాండాల నుంచి వచ్చే భక్తుల హాజరు, వారి సమన్వయం, పూజా కార్యక్రమ నిర్వహణ, భోగ్ భండారో ఏర్పాట్లు తదితర అంశాలను సమావేశంలో చర్చించారు. కార్యక్రమం జరిగే ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లు, పూజా సామగ్రి, భక్తులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా సభ్యులు తమ సూచనలు ఇచ్చారు. వివిధ తాండాల నుంచి వచ్చే సభ్యులకు ముందుగానే సమాచారం అందించడం, కార్యక్రమ సమయానికి సంబంధించి సమన్వయం చేసుకోవడం, పూజా కార్యక్రమంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను క్రమపద్ధతిలో చేపట్టడం వంటి అంశాలపై చర్చ జరిగింది. తాండాల వారీగా సభ్యులతో సంప్రదింపులు జరిపి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో ఐదు తాండాలకు చెందిన ముఖ్యులు, పెద్దలు, పూజారులు, కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమ నిర్వహణలో ఎదురయ్యే అవకాశం ఉన్న సమస్యలను ముందుగానే గుర్తించి వాటికి తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పూజా కార్యక్రమం సందర్భంగా భక్తుల రాకపోకలు, కార్యక్రమ ప్రదేశంలో క్రమబద్ధమైన నిర్వహణ వంటి అంశాలపై కూడా చర్చించారు. అలాగే భోగ్ భండారో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని, బాధ్యతలను అవసరానికి అనుగుణంగా పంచుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. వివిధ తాండాల ప్రతినిధులు పరస్పరం సంప్రదించుకుంటూ కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని అందరికీ చేరవేయాలని చర్చించారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయడం, పూజా కార్యక్రమాన్ని నిర్ణయించిన విధంగా నిర్వహించడం, తాండాల మధ్య సమన్వయం కొనసాగించడం వంటి అంశాలను సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. సమావేశంలో పాల్గొన్న పెద్దలు, పూజారులు, కార్యకర్తలు తమకు అప్పగించే బాధ్యతలను సమన్వయంతో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 20న జరగనున్న మహాభోగ్ భండారో పూజా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తూ, మిగిలిన పనులను కూడా సమయానికి పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమ నిర్వహణలో తాండాల ప్రతినిధుల మధ్య నిరంతర సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది.

# ఆకుతోటపల్లిలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన

**-అనుమతులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్..**

**తెలంగాణ పత్రిక (కల్వకుర్తి):**

ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో కొనసాగుతున్న మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. సర్పంచ్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా గ్రామస్తులు గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మైనింగ్ అనుమతులను రద్దు చేయాలంటూ నినాదాలు చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మైనింగ్ కార్యకలాపాల వల్ల గ్రామ పరిసర ప్రాంతాలు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మైనింగ్‌కు సంబంధించిన అనుమతులను తక్షణమే రద్దు చేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో గ్రామ నాయకులు శశిధర్‌రెడ్డి, కృష్ణ, బాలయ్య, విజయ్‌తో పాటు రైతులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న.. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మిర్యాలగూడ ప్రతినిధి//సెప్టెంబర్ 19:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ మండలం తుంగపాడు జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మిర్యాలగూడ నియోజకవర్గం స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. వివిధ క్రీడా విభాగాల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులు, పతకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులు అధికారులు సమన్వయంతో పనిచేయాలి ప్రత్యేక అధికారి మల్లేష్







ఓదెల సెప్టెంబర్ 19 తెలంగాణ పత్రిక

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు సర్పంచులు సమన్వయంతో పని చేయాలని సూచించిన మండల ప్రత్యేక అధికారి మల్లేష్ ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో అనిల్ రెడ్డి అధ్యక్షతతో జరిగింది ఈ సందర్భంగా పలు శాఖల అంశాలపై సర్పంచులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గ్రామాల అభివృద్ధి చెందుతూనే మండలం అభివృద్ధి దిశలో ప్రయాణిస్తుందని పేర్కొన్నారు ఈ సందర్భంగా

**అధికారులపై సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు**

ప్రజలతో ఎన్నుకోబడిన మాకు మా ప్రభుత్వం ఉంటుంది మా ఎమ్మెల్యే ఉంటాడు ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస విలువ లేకుండా చూస్తున్నారని దీనికి నిదర్శనం తండ సర్పంచి నిమ్మా నాయక్ తహసిల్దార్ బానోత్ వనజ నాయక్ సర్పంచ్ పై దురుసుగా ప్రవర్తించి . తనను ఆఫీస్ నుండి అవతలికి వెళ్ళమని గేట్ అవుట్ అని దురుసుగా ప్రవర్తించిందని నిమ్మ నాయక్ ఆరోపించారు వెంటనే క్షమాపణ చెప్పేంతవరకు ఊరుకునేది లేదని అనడంతో సమావేశంలో గందరగోల పరిస్థితి ఏర్పడ్డది గుగులోతు నిమ్మ నాయక్ అండగా సర్పంచులు ఒకేసారి ఆందోళనకు దిగి తహసిల్దార్ వనజా నాయక్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు సర్పంచ్ల నిరసనతో స్పందించిన తహసిల్దార్ వనజా నాయక్ జరిగిన విషయంపై స్పందిస్తూ నిమ్మ నాయకు క్షమాపణ చెప్పడంతో వివాదం శాంతించింది దీనితో సర్పంచ్లు తమ నిరసనలు విరమించారు ఇప్పటికైనా తాసిల్దార్ తమ తీరును మార్చుకోవాలని ఈ సందర్భంగా సర్పంచులు స్పష్టం చేశారు అదేవిధంగా విద్యుత్ అధికారులపై సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు కనీసం సర్పంచ్ లశీ అని గౌరవం లేకుండా ఏ పని చెప్పినా చేయడం లేదని అంతేకాకుండా గ్రామంలో అనేక కరెంటు స్తంభాలు వేస్తున్న తరుణంలో కనీసం సర్పంచ్ కి సమాచారం ఇవ్వకుండా మిషన్ భగీరథ పైప్ లైన్ ను ధ్వంసం చేస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంతేకాకుండా నడి రోడ్లపై స్తంభాలను నిలబెడుతూ రహదారుల నిర్మాణాలకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు అంతేకాక ఎండా మండలంలో అనేక గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్లకు ఇప్పటివరకు కరెంటు మీటర్లు ఇవ్వలేదని ప్రజా పాలనలో అధికారులు ఎవరికి వారు యమునా తీరు అన్నట్టు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్పంచ్లను గౌరవించి ప్రతి విషయంలో సమాచారం అందించాల ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కరెంటు అధికారులు సర్పంచ్లతో ఒక సారి సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు ఈ సందర్భంగా తహసిల్దార్ వనజ నాయక్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోవడం జరిగిందని దానికి దేశంలో కొంత 2500 మంది కి నోటీసులు జారీ చేయడం జరిగిందని అందులో ఒక వెయ్యి వరకు సమస్యను పరిష్కరించడం జరిగిందని ఇంకొక 15 మంది సమస్యను అలాగే ఉందని వారు స్పందించడం లేదని అన్నారు అంతేకాకుండా అత్యధికంగా కొలనురులే 1300 మంది ఉండడం జరిగిందని దానిపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అన్నారు అదే కాకుండా హరులైన వారికి రేషన్ కార్డు అందించడం హారులైన వ్యక్తులకు పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు గణేష్ నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా నిర్ణీత గడువు కె నిమజ్జనం నిర్వహించాలని సిఐ రంజిత్ రావు పేర్కొన్నారు ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాన్ని జరుపుకోవాలని వాహనాలను నడిపే డ్రైవర్లను ఎప్పటికప్పుడు అబ్జర్వ్ చేయాలని మద్యం సేవించి వాహనాలు నడపరాదని అదే విధంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చాలా జాగ్రత్తగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని చిన్న పిల్లలను నిమజ్జన కార్యక్రమానికి తీసుకు వెళ్ళకూడదని నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్తు వెల్తురు సౌకర్యం కల్పించాలని సూచించారు ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రతి విషయాలపై కులం కుశంగా చర్చించుకొని పైన తెలిపిన విషయాలను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల సహాయంతో కృషి చేస్తామని ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లేష్ తహసిల్దార్ వనజా నాయక్. ఎంపీడీవో అనిల్ రెడ్డి సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రావ్ ఎస్సై సనత్ కుమార్ రెడ్డి తో పాటు వివిధ శాఖల అధికారులు సర్పంచులు ఉప సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు

# పాపన్నపేటకు తీరిన తాగునీటి కష్టాలు







-ఎమ్మెల్యే రోహిత్ రావు చేతుల మీదుగా పంపుసెట్ల ఘన ప్రారంభం

పాపన్నపేట, సెప్టెంబర్ 19:(తెలంగాణ పత్రిక)

పాపన్నపేట గ్రామ ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది. మండల కేంద్రమైన పాపన్నపేటలో శనివారం రెండు నూతన మోటార్ పంపుసెట్లను మెదక్ ఎమ్మెల్యే శ్రీ మైనంపల్లి రోహిత్ రావు,ఘనంగా ప్రారంభించారు. గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో రామాలయం గుడి వద్ద ఏర్పాటు చేశారు. అలాగే కొత్త లింగాయ పల్లి, పాత లింగాయపల్లి, కొంపల్లి గ్రామాలలో కూడా నూతన బోర్ మోటార్లను ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఈ కాలనీల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ శ్రీమతి పావని నరేందర్ గౌడ్,ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి పంపుసెట్లను మంజూరు చేసి నేడు ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఎంపీపీ పెద్ద హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పోషకాహార భద్రతా వారోత్సవాల్లో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. తదనంతరం పాతూరులోని హనుమాన్ ఆలయంలో హనుమంతుని, గణేషుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ శ్రీమతి పావని నరేందర్ గౌడ్, ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్,మండల ముఖ్య నాయకులు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా కేజీబీవీ వినాయకుడి నిమజ్జనం

-ఆటపాటలతో ఆనందోత్సవాల మధ్య గణనాథుడికి వీడుకోలు



గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ వసంత శైలజా రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థుల సందడి విద్యార్థినులు ఉత్సాహంగా ఆటపాటలు, నృత్యాలతో పాల్గొని నిమజ్జన వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు విద్యార్థినుల ఆనందోత్సాహాల మధ్య వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు "గణపతి బప్పా మోరియా..మంగళమూర్తి మోరియా.. అంటూ గణనాథుడికి అంటూ వీడ్కోలు పలికారు.

## పెన్షన్ల పేరుతో జోరుగా డబ్బులు వసూలు

-కామారెడ్డి పట్టణంలో కలకలం

కామారెడ్డి , సెప్టెంబర్ 19, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

చేయూత పింఛన్ల పేరుతో కొందరు దళారులు అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యవహారం కామారెడ్డి పట్టణంలో కలకలం రేపుతోంది. కొత్త పింఛన్ ఇప్పిస్తామని, పెండింగ్ లో ఉన్న పింఛన్ విడుదల చేయిస్తామని ఆశ చూపి కొందరు మధ్యవర్తులు డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. మీకు పింఛన్ వచ్చేలా చేస్తా, అధికారులతో మాట్లాడి పని చేయిస్తా అంటూ ఒక్కొక్కరి నుంచి రెండు వేల నుంచి ఐదు వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. డబ్బులు ఇచ్చిన తర్వాత ఫోన్లు ఎత్తకపోవడం, తప్పించుకు తిరగడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిశీలించి అర్హులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు నేరుగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా చూడాలని, వార్డుల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తున్నారు. పెన్షన్ల కోసం ఎవ్వరికి డబ్బులు ఇవ్వద్దు ఉమారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ ఈ వ్యవహారంపై మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి స్పందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ నిబంధనల మేరకు పెన్షన్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 19):

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జిల్లా ఎన్నికల అధికారి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ ఎన్నికల అధికారి జి. సునీల్ ఈ ప్రకటనను జారీ చేశారు. ఈ ఎన్నికల ద్వారా మొత్తం 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోనున్నారు.

**ఎన్నికల కీలక తేదీలు – వివరాలు:**

**నామినేషన్ల స్వీకరణ:**

**తేదీ - సమయం:** సెప్టెంబర్ 24న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు.

హాజరయ్యే స్థలం: ఐడీఓసీ (×ణూజ), పాల్వంచలోని జిల్లా బ్రాంచ్ కార్యాలయం.

**నామినేషన్ రుసుము:** ఒక్కో నామినేషన్‌కు రూ. 10,000/– నిర్ణయించారు.

**నామినేషన్ల పరిశీలన:**

సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన చేపడతారు.

**నామినేషన్ల ఉపసంహరణ – తుది జాబితా:**

**ఉపసంహరణ సమయం:** సెప్టెంబర్ 26న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు అవకాశం కల్పించారు.

తుది అభ్యర్థుల జాబితా: అదే రోజు (సెప్టెంబర్ 26) సాయంత్రం 3:00 గంటలకు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

**పోలింగ్ – ఫలితాల వెల్లడి:**

**పోలింగ్ తేదీ - సమయం:** అక్టోబర్ 4న ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు.

**పోలింగ్ కేంద్రం:** ఐడీఓసీ (IDOC) కలెక్టరేట్, భద్రాద్రి కొత్తగూడెం.

–ఓట్ల లెక్కింపు – ఫలితాలు: పోలింగ్ పూర్తయిన అనంతరం అదే రోజు (అక్టోబర్ 4న) ఓట్ల లెక్కింపు చేపట్టి వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు.

**అధికారుల ?నలు:**

ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ల జాబితా, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రం నిర్వహణ, ఓట్ల లెక్కింపు తదితర కీలక అంశాలపై అధికారులు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఎన్నికల సమగ్ర ప్రక్రియ అంతా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## యంగ్ మాస్టర్ మైండ్ స్కూల్ లో అన్నదాన కార్యక్రమం



కామారెడ్డి ,సెప్టెంబర్ 19, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా యంగ్ మాస్టర్ మైండ్ హై స్కూల్ లో అన్నదానం కార్యక్రమం. గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని. ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాలు భజన భక్తి పాటలు. భక్తిశ్రద్ధలతో 9 రోజులు గణనాథునికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహిస్తారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్ మాస్టర్ మైండ్ హై స్కూల్ ప్రిన్సిపల్ వి రజిత రెడ్డి మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. గణనాథుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక పూజల్లో మెదక్ కలెక్టర్ దంపతులు



మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 19 సెప్టెంబర్

వినాయక పూజల్లో మెదక్ కలెక్టర్ దంపతులు ప్రతిమాసింగ్ ,శుభం సింగ్, పిల్లలు ఏకాంషి , అద్విత, కలిసి నేతాజీ గణేష్ మండలి కోలిగడ్డ లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ విఘ్నేశ్వరుని కరుణాకటాక్షాలతో అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో తులతూగాలని సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మెదక్ నేతాజీ గణేష్ మండలి సభ్యులు , సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కోర్టు భవనాన్ని పరిశీలించిన సిఐ రంజిత్ రావు



ఓదెల సెప్టెంబర్ 19 తెలంగాణ పత్రిక

ఓదెల మండల కేంద్రంలో నూతనంగా ముస్తాబవుతున్న కోర్టు భవనాన్ని శనివారం సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రావు ఎస్సై సనత్ కుమార్ రెడ్డి పరిశీలించారు మండలంలో కోర్టు భవనం నిర్మాణ పనులు పురోగతిని మరియు భద్రత ఏర్పాట్లను పరిసరాలను పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు నూతన కొట్టు భవనం పూర్తి అయితే రెండు మండలాల ప్రజలకు అనేక న్యాయ సేవలు అందుతాయని పేర్కొన్నారు.

## 151 నైవేద్యాలతో గణనాథునికి పూజ



పాలకుర్తి సెప్టెంబర్ 19(తెలంగాణ పత్రిక):



పాలకుర్తి మండల కేంద్రము లోని వరసిద్ధి వినాయక ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విస్నూర్ రోడ్డులో గల వినాయక మండపం వద్ద మహిళా భక్తులు 151 నైవేద్యాలతో గణనాథున్ని ఘనంగా పూజించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# మతసామరస్యానికి ప్రతీకగా ముస్లిం దంపతులు







-వినాయక వేడుకల్లో ముస్లిం దంపతులు

నంగునూరు, సెప్టెంబర్ 19(తెలంగాణ పత్రిక):

వినాయక వేడుకల్లో మతసామరస్యం వెల్లివిరిసింది. సిద్ధిపేట నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గఫూర్--షబానా దంపతులు ఆదర్శంగా నిలిచారు. గఫూర్ బాల్యం నుంచే వినాయక వేడుకల్లో పాల్గొంటున్నారు. ప్రతి సంవత్సరం వేడుకల్లో ఆయన పాల్గొంటున్నారు. ఈ ఏడాది తన భార్య షబానాతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శనివారం ఉదయం, సాయంత్రం జరిగిన పూజలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గఫూర్--షబానా దంపతులు స్వయంగా ప్రసాదాన్ని తయారు చేశారు. ఇంట్లో పులిహోర, సిరా తయారు చేశారు. వాటిని వినాయక భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. దంపతుల సేవను భక్తులు అభినందించారు. మతాలకు అతీతంగా పండుగల్లో పాల్గొనడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రేమ, సోదరభావం, పరస్పర గౌరవమే సమాజానికి బలమని దంపతులు చాటి చెప్పారు. వినాయక వేడుకల వేదికగా మత సామరస్య సందేశాన్ని అందించారు. గఫూర్--షబానా దంపతుల సేవలు పలువురికి ఆదర్శంగా నిలిచాయి.

**మతసామరస్యానికి ఆదర్శం**

పండుగలు కేవలం మతపరమైన వేడుకలు మాత్రమే కావని రాంపూర్ గ్రామానికి చెందిన షబానా - గఫూర్ దంపతులు చాటి చెప్పారు. పండుగలు మనుషులను కలిపే వేదికలని నిరూపించారు. మతాలు వేరైనా మనసులు ఒక్కటే అనే సందేశాన్ని అందించారు. ప్రేమ, సోదరభావం, పరస్పర గౌరవమే సమాజానికి నిజమైన బలమని చాటారు. షబానా -- గఫూర్ దంపతుల మత సామరస్య స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలిచింది. "మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే" అనే సందేశాన్ని రాంపూర్ వినాయక వేడుకలు చాటి చెప్పాయి.

# మనసు ప్రశాంతంగా ఉంచుదాం

-లెక్చరర్ ఉమాశేషారావు వైద్య

కామారెడ్డి ,సెప్టెంబర్ 19,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఇంట్లో పనికిరాని వస్తువులు పేరుకుపోతే ఎప్పటికప్పుడు తీసి పారేస్తాం. ఫోనులో చోటు లేదంటేఅవసరంలేనిచిత్రాలూ, సందేశాలూ తొలగిస్తాం. కానీ మనసు విషయంలోమాత్రంఈ జాగ్రత్త చాలామందికిఉండదు. ఎప్పుడో ఎవరో అన్న మాట,జ రిగిన అవమానం,ఎదురైనఅప జయం, తీరనికోరిక,తెగిపోయి న బంధం అన్నింటినీ పది లం గా దాచుకుంటారు. మంచి జ్ఞా పకాలకు చోటిచ్చినట్టే చెడు అ నుభవాలకూచోటిస్తూపోతారు చివరికిమనసునిండిపోతుంది. కొత్త ఆనందం మదితలుపు తట్టినా లోపలికి రావడానికి చోటుం డదు. నిజానికి ఖాళీకి కూడా గొప్ప విలువ ఉంది. కుండను తయారుచేసేది మట్టి తోనే,కానీదాన్నిఉ పయోగపడేలాచేసేదిదానిలోనిఖాళీ.ఇంటిని నిర్మించేది ఇటుకలు, రాళ్లే అయినా మనం నివసించేది వాటి మధ్యనున్న ఖాళీలోనే. వేణువులోని రంధ్రాలే లేకపోతే మధురమైన నాదం పలకదు. మనసూ అంతే. దాన్నిఎప్పటిక ప్పుడు నింపుకోవడమే కాదు, అవసరం లేనివాటినివదిలించు కోవడమూతెలియాలిపతంజలి యోగదర్శనం చిత్తంలోఏర్ప డే వృత్తులకు ఎంతో ప్రాధాన్య మిచ్చింది. అనుభవం ముగిసి పోవచ్చుకానీ అది మనసు లో ముద్రగా మిగిలిపోతుంది. ఆ




ముద్రలే సంస్కారాలుగా బలపడతాయి అందుకే యోగసూత్రంస్మృతిని అనుభూతవిషయా సంప్రమోషఃస్మృతిః అంటుంది. అనుభవించిన విష యం జారిపోకుండా చిత్తంలో నిలిచిపోవడమే స్మృతి అన్నది దాని భావం. జ్ఞాపకం వరమే. కానీ ప్రతి జ్ఞాపకాన్నీ జీవితాం ప్తం మోసుకెళ్లడం మాత్రం వ రం కాదు. భారతీయ తత్వ చింతనలోని ఘటాకాశ భావ నమరింత గొప్ప విషయాన్ని చెబుతుంది. కుండలో కనిపిం చే ఖాళీ ఆకాశానికి వేరైనది కాదు. కుండ ఏర్పడినప్పుడే ఆకాశం పుట్టలేదు. కుండ పగి లినప్పుడు ఆకాశం నశించదు. మధ్యలో ఏర్పడింది కుండ అ నే హద్దు మాత్రమేమనిషి అం తరంగమూఅంతే.కోపం,అసూ య, అహంకారం,



మమకారం, పాత జ్ఞాపకాలతో మనమే దా నికి గోడలుకడుతుంటాం.వాటి నే మన స్వభావమని భ్రమప డుతుంటాం. అందుకే చిత్తశు ద్ధి అంటే ఏమీ గుర్తులేని మని షిగా మారడం కాదు. జ్ఞాపకం ఉండా లి, అది బాధ పెట్టకూ డదు. అపజయం గుర్తుండాలి, అది మరో అడుగు వేయకుం డఅడ్డుపడకూడదు. జరిగినదాన్ని మరచిపో వడం కన్నా, దాన్ని ప్రతిరోజూ పదేపదేతవ్వుకో కుండా ఉండగలగడమే గొప్ప సాధననిండిన పాత్రలో కొత్త గా ఏదీ పోయలేం గతానుభూ తులతో, జ్ఞాపకాలతో నిండిపో యిన మనసులో వర్తమానా నికి చోటుండదు. అందుకే మ నసును అప్పుడప్పుడూ ఖాళీ చేసుకోవాలిఖాళీ చేసుకోవడ మంటేజీవితాన్నిఖా ళీచేసుకోవబడం కాదు కొత్త అనుభూ తు లకు మన మనసులో చోటు కల్పించడం మనసు నిండటం గొప్పే. కానీ దేనితో నిండాలో తెలియకపోతేనే అసలు కష్ట మంతా.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు స్థల పరిశీలన మార్పును వెంటనే వెనక్కి తీసుకోవాలి

-బిఆర్ఎస్ యువ నాయకులు గంగుల రవీందర్

కామారెడ్డి, సెప్టెంబర్ 19 , (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాభిక్నూర్ మండల కేంద్రానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల పరిశీలనను మార్చే ప్రయత్నాలపై బిఆర్ఎస్ యువ నాయకులు గంగల రవీందర్ ముదిరాజ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భిక్నూర్‌కు మంజూరైన పాఠశాలను భిక్నూర్‌లోనే ఏర్పాటు చేయాలని, స్థల పరిశీలన మార్పును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల మంజూరైన సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాలకవర్గ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించి సంబరాలు చేసుకున్నారని రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. అనంతరం భిక్నూర్ పరిధిలో పాఠశాల నిర్మాణానికి సంబంధించి అధికారులతో కలిసి స్థల పరిశీలనలు కూడా నిర్వహించారని తెలిపారు. అయితే ఇప్పుడు అదే పాఠశా లను భిక్నూర్ నుంచి



కామారెడ్డి శివారులోని క్యాసంపల్లికి తరలించే పరిస్థితి ఎందుకు వచ్చింది? స్థల పరిశీలన మార్పు వెనుక కారణం ఏమిటి? పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విషయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు పాఠశాల భిక్నూర్‌కు మంజూరైందని సంబరాలు నిర్వహించి, మరోవైపు స్థలాన్ని మార్చే పరిస్థితి వస్తే ప్రజలకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాల్లో పారదర్శకత పాటించాలని, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. భిక్నూర్‌కు మంజూరైన పాఠశాలను భిక్నూర్‌లోనే ఏర్పాటు చేయాలి. స్థల పరిశీలన మార్పును వెంటనే వెనక్కి తీసుకోవాలి. లేదంటే మండల యువత, విద్యార్థుల ను ఏకం చేసి ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గంగల రవీందర్ ముదిరాజ్ హెచ్చరించారు. భిక్నూర్ ప్రాంతానికి దక్కాల్సిన విద్యా సంస్థను తరలించేందుకు చేసే ఎలాంటి ప్రయత్నాన్నైనా ప్రజాస్వామ్య పద్ధతిలో అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

# పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ చేయూత

-ఎంఈఓ జీవి సత్యనారాయణ చేతుల మీదుగా 300 మందికి పంపిణీ

వెంకటాపురం. (నూగురు) సెప్టెంబర్ 19: తెలంగాణ పత్రిక ::

ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని నుగురు,వెంకటాపురం, శాంతినగర్,పత్రపురం, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారుగా 300 మంది విద్యార్థి విద్యార్థులకు బ్యాగ్స్ నోట్ బుక్స్ పలకలను వెంకటాపురం పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి జీవి సత్యనారాయణ . చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె ప్రాంతాల్లో




పేద విద్యార్థుల పట్ల ఇంత మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు బిషప్ మారినేని జాకబ్.ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకొని




ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణ రెడ్డి కల ప్రసాద్, ముద్రం రాజేష్, కంతి ముత్తయ్య , లక్ష్మణరావు, అదిశివ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాలో పాల్గొన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ (ప్రతినిధి//సెప్టెంబర్ 19:(తెలంగాణ పత్రిక):-**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కోదాడ పట్టణంలో మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి మెగా జాబ్ మేళాలో ఎంపికైన యువతీ యువకులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువత తమ విద్యా అర్హతలు, నైపుణ్యాలను సద్వినియోగం చేసుకొని అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి మెగా జాబ్ మేళాల ద్వారా నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు లభించడం అభినందనీయమన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు చేస్తున్న కృషికి ఆయన అభినందనలు తెలిపారు. ఉద్యోగాలు పొందిన యువతీ యువకులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఐలు ద్వితీయ మహాసభ – తీర్మానం

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక సెక్టరు 19**

మణుగూరులో శనివారం జరిగిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ద్వితీయ మహాసభలో గౌరవ అధ్యక్షుడిగా యం. వి. ప్రసాద రావు, అధ్యక్షుడిగా పొనుగోటి కిషన్ రావు, ప్రధాన కార్యదర్శిగా కిలారు పురుషోత్తం రావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి. కే. అన్నపూర్ణ, బండారు అరుణ్ చంద్, మారం సతీష్ కుమార్ బాబు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా పాయం రవి వర్మ, తెల్లబోయిన రమేష్, సుడిగాలి వెంకట నర్సయ్య, కోశాధికారిగా



ఉప్పు అరుణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 26 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్



(ఐలు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కన?్వినింగ్ కమిటీ కన్వీనర్ గా జి కే అన్నపూర్ణ మరియు కో కన్వీనర్ గా దాసరి కవిత ఎన్నికయ్యారు

## రాష్ట్రంలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి

**-క్రీడల్లో ప్రతిభను చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి**
**-జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని**

**కరీంనగర్, సెప్టెంబర్ 19:**

క్రీడా రంగంలో కరీంనగర్ జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని అన్నారు. జిల్లాలో నిర్వహించే క్రీడా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (గా+ఫీ) పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ చైతన్య జైని హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు క్రీడల్లో నాణ్యమైన శిక్షణ అందించి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో పాటు శారీరక అభివృద్ధి, మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో మరింతగా పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. మహిళా వ్యాయామ ఉపాధ్యాయులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ అధికారి మిల్కూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో క్రమశిక్షణకు వ్యాయామ ఉపాధ్యాయులు మారుపేరుగా నిలుస్తున్నారని అన్నారు. విద్యార్థులను ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. డీసీఈబీ కార్యదర్శి భగవత్‌రావు మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని సూచించారు. జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా జట్లు ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి క్రీడాకారుడు తన జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎల్. బన్సిలాల్ క్రీడల నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బాబు శ్రీనివాస్, కార్యదర్శి అడెపు శ్రీనివాస్, అంతట్టి శంకరయ్య, గిన్నె లక్ష్మణ్, వీరన్న, సూర్యప్రకాశ్, కే.







కృష్ణ, యూనిస్ పాషా, దత్తాత్రేయ, వీరపాల్ రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, కట్ట సంతోష్, శేఖర్, జ్యోతి, రాజు, నాగరాజు, కట్ట అశోక్ తదితరులు పాల్గొన్నారు. అండర్-14 బాలుర విభాగంలో విజేతలు ఖో-ఖో: చొప్పదండి ప్రథమ స్థానం, కొత్తపల్లి ద్వితీయ స్థానం. కబడ్డీ: కరీంనగర్ అర్బన్ ప్రథమ స్థానం, చొప్పదండి ద్వితీయ స్థానం. వాలీబాల్: కొత్తపల్లి ప్రథమ స్థానం, వీణవంక ద్వితీయ స్థానం సాధించాయి.

## ఆదర్శ్ నగర్ గణనాథ మండపం వద్ద సేవా సంకల్ప్ అభియాన్

**-చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో 1000 మందికి అన్న ప్రసాద వితరణ...**

**రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, సెప్టెంబరు 19,(తెలంగాణ పత్రిక)**

శేరిలింగంపల్లి ఆదర్శ్ నగర్ యూత్ అసోసియేషన్ గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించి, వెయ్యి మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా



చింతకింది గోవర్ధన్ గౌడ్ వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఇది ఆదర్శంగా తీసుకుని బిజెపి నాయకులు, మోడీ అభిమానులు వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం చింతకింది గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ పేరిట అన్న ప్రసాద వితరణ



చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆదర్శ్ నగర్ కాలనీ యూత్, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్, ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపాల వద్ద దాదాపు 6 వెల మందికి పైగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, రంగా గౌడ్, బెజగం కేశవులు, పుట్ట వినయకుమార్ గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీనివాస్ నాయి, రవీందర్ రెడ్డి, అల్లూరయ్య, శ్రీనివాసరావు, అరుణ్ గౌడ్, డాకయ్య గౌడ్, కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు..

## ఏ మనోహర్, జనరల్ మేనేజర్ (సిపిపి) కి సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 19**

కొత్తగూడెం జిఎం ఆఫీస్ కార్యాలయం నందు ఈ నెల అనగా సెప్టెంబర్ 30న పదవి విరమణ పొందుతున్న జిఎం (సి పి పి ) ఏ మనోహర్ ని పదవి విరమణ పొందుతున్న సందర్భంగా, ఘనంగా పుష్పగుచ్ఛంతో శాలువాలతో కొత్తగూడెం ఏరియా వివిధ విభాగాధి పతులు, అధికారులు జిఎం కార్యాలయంలోని అధికారులందరూ ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం జిఎం మాట్లాడుతూ ఏ మనోహర్, జనరల్ మేనేజర్ (సి పి పి ) కంపెనీకి నందు 1988 సంవత్సరంలో మైనింగ్ అధికారిగా అపాయింట్మెంట్ అయి వివిధ పదోన్నతులు పొందుతూ జి.ఎం. (సి పి పి ) గా ఉద్యోగ విరమణ పొందుతున్నారని వారు కంపెనీకి చేసిన సేవను గురించి కొనియాడడం జరిగింది. ప్రతి ఒక్కరూ వారిని మార్గదర్శ కంగా తీసుకొని పనిపై అంకితభావంతో సమిష్టి కృషితో సింగరేణి ని అభివృద్ధి పథంలో నడవటానికి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, ఎస్.ఓ.టు జిఎం ఏం గోవిందరావు, డిజిఎం లు ఎన్. యోహాను,ఐ సుధీర్ ఇతర కొత్తగూడెం ఏరియా వివిధ విభాగాధిపతులు, అధికారులు, జిఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నాణ్యత భద్రతకు 33 కేవీ కవర్డ్ కండక్టర్ లైన్



**జగిత్యాల, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):**

విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడంతో పాటు విద్యుత్ అంతరాయాలు లైన్ ట్రిప్పింగ్‌లను తగ్గించే ఉద్దేశంతో జగిత్యాల డివిజన్ రామన్నపేట సెక్షన్ పరిధిలోని 33 కేవీ తిరుమలాపూర్ ఫీడర్‌పై సుమారు 3 కిలోమీటర్ల 33 కేవీ కవర్డ్ కండక్టర్ లైన్‌ను సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ కవర్డ్ కండక్టర్ ఏర్పాటు ద్వారా విద్యుత్ లైన్ల భద్రత పెరగడంతో చెట్ల కొమ్మలు గాలులు తదితర కారణాల వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించేందుకు దోహదపడనుందని వివరించారు. ఎస్ఈ వెంట డీఈ ఆపరేషన్ జగిత్యాల ఏడీఈ ఆపరేషన్ మల్యాల ఏఈ సంబంధిత సిబ్బంది ఏజెన్సీలు ఉన్నారు.

## దోమకొండగడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలోనిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



**కామారెడ్డి, సెప్టెంబర్ 19,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని గోసంగి వాడ ప్రాంతంలో నిరుపేదలైన కుటుంబాలకు దోమకొండ గడి కోట ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల ను సర్పంచ్ నరసయ్య పంపిణీ చేశారు. ప్రతి వాడకు నిరుపేదలైన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేయనట్లు నిర్వాహకులు బాబ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్. మాజీ జెడ్పిటిసి సభ్యుడు తిరుమల్ గౌడ్. పట్టణ అధ్యక్షుడు మధు. వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్. మల్లేష్ యాదవ్. నర్సింలు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నెం నాగేంద్ర వర్మ. నాయకులు సుధాకర్ యాదవ్. అశోక్ యాదవ్. దేవరాజ్ యాదవ్. గణేష్ పిప్పిరి బాలరాజ్ తో పాటు కాలనీవాసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రక్త దానానికి ముందుకు రావడం అభినందనీయం

**-ఆపరేషన్ నిమిత్తమై సకాలంలో రక్తం అందజేత**
**-ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు**

కామారెడ్డి, సెప్టెంబర్ 19, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆపరేషన్ నిమిత్తమై బోయ నవనీత కు ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సింగరాయపల్లి గ్రామానికి చెందిన విట్టల్ గౌడ్ మానవతా దృక్పథంతో స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ప్రతిరోజు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారికి కావాల్సిన రక్తాన్ని అందజేయడం కోసం నిరంతరంగా ప్రయత్నిస్తున్నామని రక్త దాతల సహకారంతో మాత్రమే సకాలంలో రక్తాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు. సకాలంలో రక్తం దొరక్కపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఎదురవుతాయని అన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన అధికం విట్టల్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ములుగు డిసిసి అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు



వెంకటాపురం. (నూగురు) సెప్టెంబర్ 19 : తెలంగాణ పత్రిక ::

ములుగు జిల్లా డిసిసి అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను వెంకటాపురం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధుల ఘనంగా నిర్వహించారు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిత్రపటానికి పూల మాలలు వేసి అందరి సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిడెం. మోహన్ రావు. మాట్లాడుతూ ప్రజాసేవ లక్ష్యంగా అశోకు ప్రజలకు మరింత సేవ చేయాలని మరెన్నో ఉన్నత పదవులు అందుకోవాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో కొనసాగా లని ఆకాంక్షించారు. మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్. ఆధ్వర్యంలో జరి గిన వేడుకల్లో చిడెం. సాంబశివరావు. చిట్టెం సాయి. సాగర్.. సీనియర్ నాయకులు. చిట్టెం వాసు. సర్పంచ్ తాటి సరస్వతి. నాయకులు శ్రీరాముల. రమేష్కె సుందర్రావు. జల్లి గంపల కళాధర్. నాని తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ భోజనంపై ఫిర్యాదులు



కామారెడ్డి, సెప్టెంబర్ 19, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోఆరోగ్యశ్రీ పేషెంట్లకు నిబంధనల ప్రకారం భోజనం అందడం లేదని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. 550 గ్రాముల అన్నం కర్రీ, చారు గుడ్డు అరటిపండు పాలు, మజ్జిగ అందించాల్సి ఉండగా ముఖ్యంగా ఉడికి ఉడకని అన్నం అందిస్తున్నారని పేషెంట్లు వాపోతున్నారు. అంతేకాదు ఆసుపత్రి వార్డులు, హాళ్లలో డస్ట్‌బిన్‌లలో చెత్త పేరుకుపోయి పరిశుభ్రత లోపిస్తోందని రోగులు చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ పేషెంట్లకు నాణ్యమైన భోజనం, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ అందేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

## సిరిసిల్లలో పొలిటికల్ హీట్ కేటీఆర్ కోటలో రేవంత్ రెడ్డి పర్యటనపై తీవ్ర ఉత్కంఠ.!

తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్



కేటీఆర్ అడ్డాగా ఉన్న సిరిసిల్ల నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి పర్యటనపై రోజురోజుకూ ఆసక్తికరమైన రాజకీయ చర్చ సాగుతోంది. దాదాపు డెబ్బై శాతానికి పైగా జనాభా కలిగిన పద్మశాలి సమాజం, చేనేత మరియు పవర్లూమ్ రంగాలు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న ఈ ప్రాంతంలో ముఖ్యమంత్రి ఏం మాట్లాడబోతున్నారు మరియు ఏ హామీలు ఇవ్వనున్నారు అనే అంశం స్థానికంగా తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. బిసి వర్గాల సంక్షేమం మరియు పద్మశాలి సామాజిక వర్గానికి రాజకీయంగా తగిన గుర్తింపు ఇవ్వడంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించింది. రాబోయే నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వర్గానికి ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించే దిశగా కీలక ప్రకటనలు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. సిరిసిల్ల ప్రాంతంలో బలమైన పద్మశాలి నాయకత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా బిఆర్ఎస్ ఓటు బ్యాంకును దెబ్బతీయాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. మరోవైపు సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకునేందుకు ఆర్థిక సహాయం, రుణమాఫీ, నూలు రాయితీలు మరియు మహిళా సంఘాల ద్వారా చీరల ఆర్డర్ల కేటాయింపులపై స్పష్టమైన హామీలను ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. గత బిఆర్ఎస్ పాలనలో నేత కార్మికుల విషయంలో జరిగిన లోపాలను ఎత్తిచూపుతూ, ప్రస్తుత ప్రభుత్వం చేనేత రంగానికి అండగా నిలుస్తుందని చాటిచెప్పే ప్రయత్నం సీఎం చేయనున్నారు. నకిరేకల్ వేదికగా విసిరిన సవాల్‌కు అనుగుణంగా, సిరిసిల్లకు నేరుగా వచ్చి రాజకీయ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా ప్రతిపక్షాలకు గట్టి సంకేతం పంపాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. కేవలం రాజకీయ విమర్శలే కాకుండా నేతన్నలకు భరోసా నిచ్చే ప్యాకేజీలు, రాజకీయ పదవుల హామీలను ప్రకటిస్తేనే ఈ పర్యటన కాంగ్రెస్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు

# అవినీతిని ప్రశ్నిస్తే బెదిరింపులా

**- సర్పంచ్ జీడిపల్లి నర్సింహా రెడ్డి, ఉపసర్పంచ్‌ల బాల గౌడ్ తీరుపై**
**-వార్డు సభ్యురాలు దేవోల్లా ప్రత్యూష రాములు ఆగ్రహం**
**-మా సహాయం కోరినవారే.. మాపైనే ఫిర్యాదులు చేస్తున్నారు**
**-సర్పంచ్, ఉపసర్పంచ్ తీరుపై 9వ వార్డు సభ్యురాలు దేవోల్ల ప్రత్యూష రాములు తీవ్ర ఆరోపణలు**
**-కక్ష సాధింపు, బెదిరింపులు, అసభ్య పదజాలంతో వేధిస్తున్నారని వెల్లడి**

కామారెడ్డి, సెప్టెంబర్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



తమ సహాయం కోసం వచ్చిన వారే ప్రస్తుతం తమపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తూ, ఫిర్యాదులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫరీద్‌పేట్ గ్రామ 9వ వార్డు సభ్యురాలు దేవోల్ల ప్రత్యూష రాములు ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో గ్రామ సర్పంచ్ జీడిపల్లి నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ కోల బాలగౌడ్ తీరుపై ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ఎస్సీ మహిళా రిజర్వేషన్‌లో 9వ వార్డు సభ్యురాలిగా తాను ఎన్నికైన రెండు నెలల నుంచే వ్యక్తిగత కక్షలతో తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రత్యూష తెలిపారు. గ్రామంలో అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరించడం, ఇష్టానుసారంగా వ్యవహరించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. సంబంధిత వ్యక్తిపై గతంలో కేసులు, బైండోవర్ చర్యలు జరిగినప్పటికీ ప్రవర్తనలో మార్పు కనిపించలేదని పేర్కొన్నారు. అవినీతి వ్యవహారాన్ని బయటపెట్టడంతోనే కక్ష సర్పంచ్‌కు సంబంధించిన అవినీతి వ్యవహారాన్ని తన భర్త రాములు బయటపెట్టారని ప్రత్యూష తెలిపారు. ఆ వ్యవహారంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించినట్లు పేర్కొన్నారు. అనంతరం తమపై కక్ష పెంచుకుని సీఎం సచివాలయం, జిల్లా కలెక్టర్ ప్రజావాణి, ఎస్సీ కమిషన్ తదితర వేదికల్లో ఫిర్యాదులు చేశారని ఆరోపించారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరిన సమయంలో కంఠం సిద్ధ రాములు తానే సీఎం సచివాలయంలో ఫిర్యాదు చేసినట్లు అంగీకరించారని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో తాము సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు సంబంధిత ప్రభుత్వ ఉద్యోగిని ఇకనైనా తమపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించినట్లు చెప్పారు. రాజీకి ప్రయత్నించినా సర్పంచ్ ఉప సర్పంచ్ నైన్త్ వార్డ్ దేవుల ప్రత్యూష రాములు రాజీకి అంగీకరించలేదు తమ మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు దోమకొండ మండల మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్ వద్దకు వెళ్లి, రాములు వార్డులో ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించేందుకు సహకరిస్తామని, ఇకపై ఇబ్బందులు పెట్టకుండా రాజీ పడాలని కోరినట్లు ప్రత్యూష తెలిపారు. అయితే తమ భర్త ఎలాంటి రాజీకి అంగీకరించలేదని, దీంతో తమపై కక్షపూరితంగా మత, కుల రాజకీయాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇదిలా ఉండగా, సిద్ధ రాములు తన వద్దకు వచ్చి తప్పు జరిగిందని ఒప్పుకున్నారని, రాములు కాలబరి వద్దకు వచ్చి రాజీకి అంగీకరించారని గ్రామంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రత్యూష ఆరోపించారు. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆమె స్పష్టం చేశారు. బెదిరింపులు, దూషణలు ఆపాలి తాను మహిళా ప్రజాప్రతినిధి అయినప్పటికీ తనను గౌరవించకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రత్యూష ఆరోపించారు. తాను ఇచ్చిన ఫిర్యాదులను ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేస్తూ, ప్రాణహాని కలిగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇకపై తమ కుటుంబ సభ్యుల జోలికి రాకుండా గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగంగా బాండ్ పేపర్‌పై రాతపూర్వక హామీ ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. తమపై తప్పుడు ప్రచారం, బెదిరింపులు, వేధింపులు కొనసాగితే సంబంధిత అధికారులను ఆశ్రయించి చట్టపరమైన చర్యలు కోరుతామని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శిపైనా ఫిర్యాదు చేస్తా గ్రామపంచాయతీ కార్యదర్శి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్పంచ్, ఉపసర్పంచ్ సూచనల మేరకు వ్యవహరిస్తున్నారని ప్రత్యూష ఆరోపించారు. పంచాయతీ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇకనైనా తమ కుటుంబం జోలికి రాకుండా, వివాదాలకు స్వస్తి పలకాలని ఆమె కోరారు. ఇప్పటివరకు జరిగిన విషయాలను తాము క్షమిస్తున్నామని, ఇకపై ప్రశాంతంగా ఉండేందుకు సహకరిస్తే సమస్యను ఇంతటితో ముగించేందుకు సిద్ధంగా ఉన్నామని దేవోల్ల ప్రత్యూష రాములు విలేకరుల సమావేశంలో తెలిపారు. గ్రామంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి మద్యంతో మభ్యపెడుతూ, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. సర్పంచ్ చేసిన అవినీతిని తన భర్త రాములు బయటపెట్టి ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి కట్టించడమే వారు తమపై కక్షగట్టడానికి కారణమని తెలిపారు. ఒక మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా భయభ్రాంతులకు గురిచేయడం, అసభ్య పదజాలంతో దూషించడం, చంపుతామని బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో, ఎస్సీ కమిషన్‌లో, సీఎం సచివాలయంలో ఫిర్యాదులు చేయగా, మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విచారణ సమయంలో కొందరు తప్పు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు మధ్యవర్తుల ద్వారా రాజీకి ప్రయత్నిస్తూ, గ్రామంలో మాత్రం తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సెక్రెటరీ కూడా సర్పంచ్, ఉపసర్పంచ్‌ల చేతిలో కీలుబొమ్మలా మారుతూ ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, ఆమెపై కూడా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇకనైనా సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తమ పద్ధతి మార్చుకోవాలని, లేదంటే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని స్పష్టం చేస్తూ, బాండ్ పేపర్‌పై ఇక నుంచి తమ జోలికి రామని బహిరంగంగా రాసివ్వాలని డిమాండ్ చేశారు.

# జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు

**-పారదర్శకంగా, రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహణ**
**-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్. వై. గిరి**

కామారెడ్డి ,సెప్టెంబర్ 19, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా భారత రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలిలోని 15 స్థానాల భర్తీకి నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల పరిశీలకులు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. వై. గిరి, ఎన్నికల అధికారి, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ టి. ప్రశాంత్ రెడ్డి విడుదల చేశారు. జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుల ఆదేశాల మేరకు-2026 ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా రహస్య బ్యాలెట్ పద్ధతిలో, పారదర్శకంగా మరియు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ ఎన్. వై. గిరి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్

నామినేషన్ ఫారాల స్వీకరణ

స్థానిక తహశీల్దార్ కార్యాలయాలు లేదా మండల పరిషత్ కార్యాలయాల నుంచి నామినేషన్ ఫారాలను పొందవచ్చు. నామినేషన్ల దాఖలు సెప్టెంబర్ 24న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు కామారెడ్డి కలెక్టరేట్‌లోని గది నంబర్ 02లో నామినేషన్లు స్వీకరిస్తారు.



**నామినేషన్ల పరిశీలన:**

సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన నిర్వహించి, అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ:

సెప్టెంబర్ 26న మధ్యాహ్నం 1:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

**తుది అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపు:**

సెప్టెంబర్ 26న మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించి, ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు.

**పోలింగ్:**

అక్టోబర్ 4న ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు కామారెడ్డి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహిస్తారు.

**ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి:**

అక్టోబర్ 4న సాయంత్రం 4:00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. అభ్యర్థులకు ముఖ్య నిబంధనలు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎటువంటి క్రిమినల్ నేరాలకు పాల్పడి ఉండకూడదని, క్రిమినల్ రికార్డు లేనివారై ఉండాలని అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఫారమ్-IIను పూర్తిగా నింపి, 10,000/- నాన్-రిఫండబుల్ రుసుము చెల్లించాలి. అలాగే అర్హులైన ఓటర్ల జాబితాలో ఉన్న ప్రతిపాదకుడు, బలపరిచే వ్యక్తి సంతకాలతో నామినేషన్ దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. ఓటర్లు పోలింగ్ రోజున తప్పనిసరిగా తమ ఫోటో గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు. ఎన్నికలకు సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనలు, సందేహాల నివృత్తి కోసం ఎన్నికల అధికారి 9989487624 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

## హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన తిప్పన విజయసింహారెడ్డి

తెలంగాణ పత్రికసెప్టెంబర్ 19 మిర్యాలగూడ:

మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు తిప్పన విజయసింహారెడ్డి పట్టణంలోని పలు హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మిర్యాలగూడ పట్టణం రాంనగర్ బంధానికి చెందిన అలుగుబెల్లి నాగరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి వర్షిత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన హాస్పిటల్‌కు వెళ్లి నాగరాజును పరామర్శించారు. అలాగే మిర్యాలగూడ మండలం కురియా తండాకు చెందిన మాజీ ఉపసర్పంచ్ ధనావత్ తావు మరదలు ధనావత్ నాగమ్మ గర్భసంచి ఆపరేషన్ అనంతరం ఝాన్సీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆమెను పరామర్శించారు. నాణ్య తండాకు చెందిన మాలోత్ పద్మా నెహ్రూ కుమార్తె ప్రసవించి బాబు జన్మించిన సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చింతపల్లి గ్రామం టీక్య తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ భీరావత్ రాములు సతీమణి లక్ష్మీ అనారోగ్యంతో లీలా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆమెను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి లక్ష్మీ త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్, మాజీ సర్పంచులు ధీరావత్ మంగ్యా నాయక్, ధనావత్ సూర్య నాయక్, సుధాకర్ నాయక్, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# ఆదర్శ్ నగర్ గణనాథ మండపం వద్ద సేవా సంకల్ప్ అభియాన్

**-చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో 1000 మందికి అన్న ప్రసాద వితరణ.**

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం సెప్టెంబర్ 19.

శేరిలింగంపల్లి ఆదర్శ్ నగర్ యూత్ అసోసియేషన్ గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించి, వెయ్యి మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్ మాట్లాడుతూ.ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా చింతకింది గోవర్ధన్ గౌడ్ వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఇది ఆదర్శంగా తీసుకుని బిజెపి నాయకులు, మోడీ అభిమానులు వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం చింతకింది గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ పేరిట అన్న ప్రసాద వితరణ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆదర్శ్ నగర్ కాలనీ యూత్, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్, ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపాల వద్ద దాదాపు 6 వెల మందికి పైగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, రంగా గౌడ్, బెజగం కేశవులు, పుట్ట వినయకుమార్ గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీనివాస్







నాయి, రవీందర్ రెడ్డి, అల్లూరయ్య, శ్రీనివాసరావు, అరుణ్ గౌడ్, డాకయ్య గౌడ్, కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలే లక్ష్యంగా 5,500 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**-టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి..**

తెలంగాణ పత్రిక (కల్వకుర్తి), శనివారం

తెలంగాణ యువతను భవిష్యత్ సాంకేతిక రంగానికి సిద్ధం చేయడంతో పాటు, నైపుణ్యాలను ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేయడమే లక్ష్యంగా 'యువాన్' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. టాస్క్-- డెల్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో అమలు చేయనున్న ఈ కార్యక్రమంపై హైదరాబాద్‌లో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో టాస్క్ ముఖ్య నిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఐటీ అండ్ సీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి ఐఏఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





**25 కేంద్రాల్లో మూడు నెలల శిక్షణ:**

'యువాన్' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 25 కేంద్రాల్లో 5,500 మంది విద్యార్థులకు మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఐఐటీ ఢిల్లీ రూపొందించిన పాఠ్య ప్రణాళిక ఆధారంగా కృత్రిమ మేధస్సు, డిజిటల్ నైపుణ్యాలు, మేఘ గణన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఎలక్ట్రానిక్స్ తయారీతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారం అందించనుంది.

**విద్య నుంచి ఉపాధి వరకు సమగ్ర ప్రణాళిక..**

శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉద్యోగాలు, శిక్షణతో కూడిన ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి దిశగా ముందుకు వెళ్లేందుకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు సైతం ఆధునిక సాంకేతిక శిక్షణ అందుబాటులోకి తీసుకురావడంపై సమావేశంలో చర్చించారు. విద్యార్థులు చదువుకుంటున్న సమయంలోనే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం, టాస్క్, డెల్ టెక్నాలజీస్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ తదితర సంస్థల సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

# పోషణ మహోత్సవాలు సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు కొనసాగుతాయ్

జగిత్యాల, సెప్టెంబర్ 19 (తెలంగాణ పత్రిక):

పోషణ మాసం థీమ్ బడ్డీ మదర్స్ తక్కువ బరువు పిల్లలు పోషణ మహోత్సవాలు అక్టోబర్ 8 వరకు నిర్వహించుకునే కార్యక్రమాలలో భాగంగా శిశు సంక్షేమ శాఖ వయోవృద్ధులు వికలాంగులు శాఖ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో రాయికల్ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తురుగా సౌజన్య శ్రీధర్ రెడ్డి అధ్యక్షతనలో మున్సిపల్ ఆఫీస్ యందు కార్యక్రమాన్ని నిర్వహించారు. సౌజన్య శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పోషణ అనగా మనకు అందుబాటులో దొరికే ఆకుకూరల్లో కూరగాయలు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలు పప్పులో బెల్లంతో కూడుకున్న పదార్థాలు పల్లీలు నువ్వులు బాలమృతముతో అనేక రకాలైన పదార్థాలు తయారు



చేయవచ్చని అయోడిన్ ఉప్పు చిరుధాన్యాలు ఎక్కువ మోతాదులో వాడాలని తక్కువ బరువులో ఉన్న పిల్లలతో బాలామృతం ప్లస్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పిల్లల ఎదుగుదల చాలా ఎక్కువగా ఉంటుందని అంగన్వాడీలో ఇచ్చే ఒకపూట సంపూర్ణ భోజనాన్ని అందుకోవాలని గర్భవతిగా ఉన్న ప్రతి గర్భిణి తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారాన్ని తీసుకోవాలని మధ్యాహ్నం రెండు గంటలు నిద్ర ఆ గర్భినికి ఎక్సర్సైజ్ చేసినట్లయితే ఆ గర్భిణి నార్మల్ డెలివరి అయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారుల తల్లులకి క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోపారపు ప్రశాంతి 9వ వార్డు కౌన్సిలర్ బత్తిని మహేశ్వరి సిడిపిఓ జయప్రద డిస్టిక్ కో-ఆర్డినేటర్ మధు కుమార్ సూపర్వైజర్లు పద్మావతి రాధ అనూహ్య భాగ్యలక్ష్మి రాధ ఆశాలు అంగన్వాడీ టీచర్లు గర్భిణీలు బాలింతలో ఏడు నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులు మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# 'దుందుభి' కావ్య పద్యాల పోటీలు..

**-మార్చాలా విద్యార్థిని అక్షితకు ప్రథమ బహుమతి.**

తెలంగాణ పత్రిక: శనివారం (కల్వకుర్తి) సెప్టెంబర్ 19.

కల్వకుర్తి పట్టణంలోని కీర్తిశేషులు గంగాపురం హనుమత్ శర్మ కవి గుండూరి శతజయంతి సందర్భంగా కల్వకుర్తి జూనియర్ కళాశాలలో కళాశాల, పాఠశాల విద్యార్థులకు 'దుందుభి' కావ్య పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కల్వకుర్తి డివిజన్‌లోని ఐదు మండలాలకు చెందిన కళాశాలలు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో సుమారు 125 మంది విద్యార్థులు పాల్గొని కవి గుండూరి రచించిన 'దుందుభి' కావ్యంలోని పద్యాలను ఆలపిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో కల్వకుర్తి మండలం మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి ఆంగ్ల మాధ్యమ విద్యార్థిని ఎన్. అక్షిత ప్రథమ బహుమతి సాధించింది. అక్షిత ప్రతిభను గుర్తించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మాజీ అధ్యక్షులు



కసిరెడ్డి వెంకటరెడ్డి ఆమెకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సి.హెచ్. వెంకటరమణ, తెలుగు పండితులు సి. నారాయణగౌడ్ మాట్లాడుతూ,విద్యార్థుల్లో తెలుగు భాష, సాహిత్యం, పద్యాలపై ఆసక్తిని పెంపొందించే ఒదుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతా యని తెలిపారు. అక్షిత ప్రథమ బహుమతి సాధించడం పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొంటూ ఆమెను అభినందించారు.తెలుగు సాహిత్యాన్ని విద్యార్థులకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రాచీన కవుల రచనలను పరిచయం చేయడం ద్వారా వారిలో సాహిత్యాభిరుచిని పెంపొందించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు.

# పాల్వంచ సొసైటీలో 177 యూరియా బ్యాగులు తక్కువ

రైతుల ఆందోళన

కామారెడ్డి, సెప్టెంబర్ 19, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కామారెడ్డి జిల్లాపల్వంచ మండలం పరీద్ పేట సొసైటీ గోదాంలో యూరియా స్టాక్‌పై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. యాప్‌లో 2,334 బ్యాగులు స్టాక్‌గా ఉండ గా2,157 బ్యాగులు పంపిణీ చేసిన ట్లురికార్డుల్లో నమోదైనట్లు రైతులు తెలిపారు. దీంతో 177 బ్యాగులు తక్కువగా ఉన్నాయని వారు ప్రశ్నిం చారు. యాప్‌లో 'నో స్టాక్' అని కనిపించడంతో సొసైటీ అధికారులను రైతులు నిలదీశారు. అర్హులైన రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## కుర్తివాడలో డిపిఓ యాదయ్య ఆకస్మిక పర్యటన

**-గ్రామపంచాయతీ, నర్సరీ, పాఠశాల సందర్శన**

**-పాఠశాలలో మధ్యాహ్నం భోజనం రుచి చూసిన డిపిఓ**



పాపన్నపేట, సెప్టెంబర్ 19:(తెలంగాణ పత్రిక)

మండల పరిధిలోని కుర్తివాడ గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య శనివారం పర్యటించారు. స్థానిక సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు చెట్టు కింది శ్రీధర్ తో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయం, నర్సరీ, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని డిపిఓ యాదయ్య స్వయంగా రుచి చూసి భోజనం నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకం, సంరక్షణ పై వివరాలు తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై సర్పంచ్ శ్రీధర్ తో చర్చించారు. గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని డిపిఓ సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్దన్, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

## కామారెడ్డి దంపతులకు ప్రశంశలు



కామారెడ్డి, సెప్టెంబర్ 19,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రథనిది)

జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవ సంస్థ వారు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని గురువుకు అక్షర నీరాజనం అనే అంశంపై ఉత్తమ కవితలు రాసినందులకు ఆ సంస్థ జాతీయ కార్యదర్శి కోల్లి రమావతి ఇతర ప్రతినిధులు కవి దంపతులను అభినందిస్తూ ప్రశంశ పాత్రలు అందించారు.